విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :161 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | బుధవారం 28 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03
Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



## రాష్ట్రంపై అర్నాబ్ తుపాను ప్రభావం

- పలుచోట్ల భారీ వర్షాలు.. బలమైన ఈదురుగాలులు
- విశాఖలో భారీ వృక్షం నేలకూలి రాకపోకలకు అంతరాయం
- గాజువాకలో కూలిన పాఠశాల ప్రహరీ గోడ
- ఉభయ గోదావరి జిల్లాల్లో ఎడతెరిపి లేని వర్షాలు
- కోనసీమలో ఉధృతంగా సముద్ర అలలు
- తునిలో చెట్టు కూలి ఒకరికి గాయాలు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
- మత్స్యకార కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలింపు

## ఏ ఒక్క ప్రాణం పోకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయం



- తుపాను ఒక్కోసారి దిశ మార్చుకుంటుంది.. అందుకే ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం
- తుపానులు అనూహ్యంగా దిశ మార్చుకుంటాయన్న సీఎం చంద్రబాబు
- గతంలో హుదూద్, 1996 పెను తుపాను అనుభవాలను గుర్తు చేసుకున్న ముఖ్యమంత్రి
- ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని స్పష్టీకరణ
- తుపాను పూర్తిగా తీరం దాటి, వర్షాలు తగ్గే వరకు ఎవరూ బయటకు రావొద్దని విజ్ఞప్తి
- ప్రజల కోసం ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందని, సహకరించాలి
- ఆర్నాబ్ తుపాను వేళ ప్రజల ప్రాణాల రక్షణే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం

అమరావతి

"తుపాను ఒక్కోసారి వేగం పుంజుకుంటుంది, ఒక్కోసారి నెమ్మది స్తుంది, కొన్నిసార్లు అనూహ్యంగా దిశ కూడా మార్చుకుంటుంది. అందుకే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తీవ్ర తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆయన మంగళవారం రాత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, ఆస్తి నష్టాన్ని నివారించడం రెండో ప్రాధాన్యత అని ఆయన తేల్చి చెప్పారు. ప్రస్తుత తుపానును అత్యంత తీవ్రమైనదిగా వాతావరణ శాఖ వర్గీకరించిందని, దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి

వివరాలు 2లో..



## దేశ ప్రయోజనాలే కొనుగోళ్లలో కీలకం

- రష్యా చమురు దిగుమతులపై అమెరికా ఒత్తిడి లేదన్న హర్దీప్ పురి
- యుద్ధానికి ముందు రష్యా చమురుపై భారత్ ఆధారపడింది 0.2 శాతమే
- రాయితీల కారణంగా యుద్ధం తర్వాత పెరిగిన రష్యా చమురు కొనుగోళ్లు
- సెప్టెంబర్‌లో పెరిగిన మధ్యప్రాచ్య చమురు దిగుమతులు



## మణిపూర్‌లో భద్రతా దళాల ఆపరేషన్

- రైఫిళ్లు, గ్రెనేడ్లు సహా భారీగా డ్రగ్స్ స్వాధీనం!
- భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్
- రైఫిళ్లు, 240 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం
- 1.027 కిలోల బ్రౌన్ షుగర్ పట్టివేత
- 23 ఏళ్ల యువకుడి అరెస్ట్
- ఇంఫాల్ ఈస్ట్‌లో భారీగా ఆయుధాలు స్వాధీనం
- హెరాయిన్‌తో ఇద్దరు నిందితుల అరెస్ట్
- జాతి ఘర్షణలతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

## సాంకేతిక రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

- కీలక టెక్నాలజీల్లో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం
- మేడ్ ఇన్ ఇండియా చిప్స్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు
- అణు, అంతరిక్షం నుంచి ఏఐ, సెమీకండక్టర్ల వరకు సరికొత్త ఆవిష్కరణలు
- భారత సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపాలి: ప్రధాని మోదీ



## ఈసీ అఫిడవిట్ మోసపూరితం ఆ సంస్థకే నష్టం చేకూర్చేలా ఉంది

- ఈసీ అఫిడవిట్‌పై కాంగ్రెస్ అభ్యంతరం
- ఫారం-6 డిక్లరేషన్‌పై వివాదం
- నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఆరోపణ
- ఈసీనెట్ వ్యవస్థపై విమర్శలు
- పిటిషన్లను కొట్టివేయాలని ఈసీ విజ్ఞప్తి
- ర్యాలీకి అనుమతి యథాతథం
- భద్రతకు 3,500 మంది పోలీసులు
- సీసీటీవీలతో పటిష్ఠ నిఘా



## ప్రజల ప్రాణ రక్షణే ప్రథమ లక్ష్యం

- ప్రజల ప్రాణ రక్షణకే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- తుపాను ముప్పు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- 92 ఆవాసాల నుంచి ప్రజల తరలింపు
- 15 వేల మందికి పునరావాస ఏర్పాట్లు
- పునరావాస కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు
- విద్యుత్, తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- 24 గంటల అత్యవసర కంట్రోల్ రూములు



అమరావతి

అర్నబ్ తుపాను విపత్తు సమయంలో ప్రజల ప్రాణ రక్షణకే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కాకినాడ జిల్లాతో పాటు పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో చేపట్టిన ముందస్తు చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాట్లు, సహాయక బృం దాల సంసిద్ధత, విద్యుత్, తాగునీరు, రహదారులు, వైద్య సేవలపై ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు పటిష్ఠంగా అమలు చేయాలని, ముఖ్యంగా తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. తుపాను తీరం దాటే సమయంలో ఒక్క ప్రాణం కూడా నష్టపోకుండా చూడటమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నిర్దేశించారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, తుపాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్న తాళ్లరేవు, యు.కొత్తపల్లి, కాకినాడ అర్బన్, కాకినాడ

వివరాలు 2లో..



## మందుల కంపెనీల కోసమే మొత్తం వ్యవస్థ పనిచేస్తోందా?

- మందుల ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- రూ.11 వేల మందు రూ.1.30 లక్షలా?
- ఎన్‌పీపీఏ పనితీరుపై అసంతృప్తి
- ఇతర దేశాలతో పోలికపై కేంద్రానికి చురకలు
- నిర్వహణ ఖర్చుల పేరుతో ధరల పెంపా?
- 82 శాతం మందుల ధరలపై నియంత్రణ ఏదీ?
- క్యాన్సర్ మందుల ధరలపైనా గతంలో ప్రశ్నలు

## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే లక్ష్యం!



- ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాం.. అభివృద్ధికి అండగా నిలవండి
- గ్రామ స్వరాజ్యానికి స్థానిక సంస్థల బలోపేతం కీలకం
- 'చెప్పాం--చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి..
- చంద్రబాబు, పవన్ కల్యాణ్, పీవీఎన్ మాధవ్ స్పష్టం

అమరావతి

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమన్వ యంతో ఎదుర్కొనేందుకు కూటమి పార్టీలు సిద్ధమయ్యాయి. తెలుగుదేశం, జనసేన, బీజే పీ నాయకులు ఐక్యతను చాటుతూ ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని, అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను కోరారు. స్థానిక సంస్థలు బలోపేతమైనప్పుడే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'చెప్పాం--చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. అమరావతిలో నిర్వహించిన

వివరాలు 2లో..

# ఏ ఒక్క ప్రాణం పోకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయం

-మొదటిపేజీ తరువాయి

భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని చంద్రబాబు తెలిపారు. "తుపాను బుధవారం ఉదయం 5 నుంచి 9 గంటల మధ్య కాకినాడ-యానాం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 140 నుంచి 160 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయొచ్చు. కొన్నిసార్లు గాలి వేగం 180 కిలోమీటర్లకు కూడా చేరవచ్చు. తుపాను తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు కొనసాగుతాయి. కాబట్టి, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దు," అని ఆయన విజ్ఞప్తి చేశారు.

### గత అనుభవాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు

ఇలాంటి విపత్తులను ఎదుర్కోవడం తనకు కొత్తేమీ కాదని చెబుతూ, ముఖ్యమంత్రిగా తన సుదీర్ఘ అనుభవాలను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా 1996-97లో తూర్పు గోదావరి జిల్లాను అతలాకుతలం చేసిన పెను తుపాను, హుదూద్ విలయాన్ని ఆయన ప్రస్తావించారు. "1996లో వచ్చిన పెను తుపానుకు సుమారు 2,000 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ వార్త తెలియగానే హైదరాబాద్ నుంచి బయలుదేరాను. వాతావరణం అనుకూలించకపోయినా, పైలట్లకు ధైర్యం చెప్పి, అండర్‌టేకింగ్ రాసిచ్చి హెలికాప్టర్‌లో విపత్తు ప్రాంతానికి వెళ్లాను. ముమ్మిడివరం, అమలాపురంలో దిగి, 'నేనున్నానంటూ' ప్రజలకు భరోసా ఇచ్చాను. తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు వాతావరణం సహకరించకపోవడంతో విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. అక్కడి నుంచే అప్పటి ప్రధానమంత్రి దేవెగౌడ గారికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించి, తక్షణ సాయం కోరాను. ఆ తర్వాత రాజమండ్రినే కేంద్రంగా చేసుకుని,




అధికారులను మండలాల వారీగా నియమించి, సహాయక చర్యలు చేపట్టాను. ప్రైవేటు లారీలను సైతం స్వాధీనం చేసుకుని ఎమర్జెన్సీ పనులకు ఉపయోగించాను" అని చంద్రబాబు వివరించారు. అలాగే హుదూద్ తుపాను సమయంలో విశాఖపట్నం నగరం చిగురుటాకులా వణికిపోయిందని, తాను నేరుగా విశాఖ వెళ్లలేక విజయవాడలో దిగి, రోడ్డు మార్గంలో అక్కడికి చేరుకున్నానని తెలిపారు. "వారం రోజుల పాటు అక్కడే ఉండి, నగరాన్ని తిరిగి గాడిన పెట్టే వరకు విశ్రమించలేదు. పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి కూరగాయలు తెప్పించాను. ఆ అనుభవంతోనే భవిష్యత్తులో ఇలాంటి నష్టం జరగకూడదని విశాఖలో అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేశాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ అనుభవాలన్నింటినీ ఉపయోగించి, టెక్నాలజీని జోడించి ప్రస్తుత విపత్తును ఎదుర్కొంటున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### ప్రజలకు చంద్రబాబు చేసిన ముఖ్య సూచనలు

తుపాను పూర్తిగా తీరం దాటి, అధికారులు సురక్షితమని చెప్పేవరకు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దు. ముఖ్యంగా తెల్లవారుజామున కాలకృత్యాల కోసం బయటకు వెళ్లే అలవాటును మానుకోవాలి.

అన్ని రకాల ప్రయాణాలను పూర్తిగా రద్దు చేసుకోవాలి.

సెల్‌ఫోన్లు, పవర్‌బ్యాంకులను ముందుగానే ఛార్జ్ చేసి పెట్టుకోవాలి. కొవ్వొత్తులు, నిత్యావసరాలను సిద్ధంగా ఉంచుకోవాలి.

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దు. తమ బోట్లను చూసేందుకు కూడా తీరానికి వెళ్లడం ప్రమాదకరం. లోతట్టు ప్రాంతాల ప్రజలు, లంక గ్రామాల వారు తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలి.

గ్రామాల్లోని యువత, ప్రజలు తమ ఊరి చెరువులకు గండ్లు పడకుండా కాపాడుకోవాలి.

ఎక్కడైనా చెట్లు, విద్యుత్ స్తంభాలు పడితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి.

ప్రభుత్వ యంత్రాంగానికి సంపూర్ణంగా సహకరించాలి.

ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని, ఇప్పటికే 84 వేల మందికి పైగా ప్రజలను 2,199 పునరావాస కేంద్రాలకు తరలించామని చంద్రబాబు తెలిపారు. 12 ఎన్డీఆర్ఎఫ్, 10 ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు నేవీ, కోస్ట్‌గార్డ్, పోలీస్, అగ్నిమాపక దళాలు క్షేత్రస్థాయిలో ఉన్నాయని చెప్పారు. వైద్య బృందాలు, అత్యవసర మందులు, విద్యుత్ పునరుద్ధరణ సిబ్బంది, తాగునీటి ట్యాంకర్లు, జనరేటర్లను సిద్ధం చేశామన్నారు. "నేను రాత్రంతా పరిస్థితిని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తాను. ప్రజలు అధైర్యపడొద్దు. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

# రాష్ట్రంపై అర్నాబ్ తుపాను ప్రభావం

రాష్ట్రంపై అర్నాబ్ అతి తీవ్ర తుపాను ప్రభావం మొదలైంది. తీవ్ర తుపాను ప్రభావంతో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, గోడలు నేలకూలాయి. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రజల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభావిత ప్రాంతాల ప్రజలను తరలిస్తున్నారు. అర్నబ్ అతి తీవ్ర తుపాను ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలుల ధాటికి విశాఖ సిరిపురం పెట్రోల్ బంక్ జంక్షన్‌లో తుఫాన్ ప్రభావంతో భారీ వృక్షం నేలకొరిగింది. చెట్టు కూలిపోవడంతో రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న సిబ్బంది కూలిన చెట్టును తొలగించి, పునరుద్ధరణ పనులు చర్యలు చేపట్టారు. విశాఖ గాజువాక పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయింది. పాఠశాల ఆవరణలోని చెట్టు కూలడంతో ప్రహరీ గోడ ధ్వంసమైనట్లు తెలుస్తోంది. తుపాను నేపథ్యంలో పాఠశాలకు సెలవు ప్రకటించడంతో పిల్లలెవరూ రాలేదు. విద్యార్థులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



### పలు చోట్ల జోరుగా వర్షం

అర్నబ్ ప్రభావంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచీ వాతావరణ మేఘామృతమై ఉండగా మధ్యాహ్నం నుంచి జల్లులు ప్రారంభమయ్యాయి. క్రమంగా పెరుగుతూ పలు చోట్ల జోరుగా వర్షం కురుస్తోంది. రాజమహేంద్రవరంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. రాజానగరం, కడియం సహా పలు మండలాలు, గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. గోదావరి నది పాయల్లో ఉండే మత్యకార కుటుంబాలను రాజమహేంద్రవరంలోని పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి వెంటనే సమీపంలోని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. అర్నబ్ తుపాను ప్రభావంతో కోనసీమ జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. సముద్ర తీరం వెంట అలలు ఎగసిపడుతున్నాయి. ఉప్పలగుప్తం మండలం వాసాల తిప్ప వద్ద సముద్ర ఉధృతి క్రమంగా పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం కురుస్తోంది. అంబాజీపేట,రావులపాలెం మండలాల్లో వర్షం కురిసింది. తీరంలోని మత్స్యకారుల కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పోలవరం జిల్లాలోనూ వర్షం ప్రారంభమైంది. రంపచోడవరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది.

### లాడ్జి అద్దాలు ధ్వంసం

కాకినాడ జిల్లా తునిలో ఈదురుగాలుల ప్రభావంతో రైల్వేస్టేషన్ వద్ద ఓ భారీ వృక్షం నేలకూలింది. చెట్టు కూలిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఆయన్ని ఆసుపత్రికి తరలించారు. గాలుల ప్రభాతంవో ఓ లాడ్జి అద్దాలు ధ్వంసమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. ఈదురుగాలులు వీస్తున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు ప్రమాదకరంగా ఉన్న చెట్లు, స్తంభాలను తొలగించారు. జిల్లా వ్యాప్తంగా బలమైన గాలులు వీస్తున్నాయి. చాలాచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. సముద్రతీర ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టారు. కేంద్రపాలిత యానాం యానాం తీర ప్రాంతంలో తుపాను తీరం దాటుతుందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో స్థానిక ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు కోనసీమ జిల్లా పరిధిలోని ఐ.పోలవరం మండలం భైరవపాలెం, తీర్థాలమొండి గ్రామాల ప్రజలను కలిశారు. పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ప్రజలకు సూచించారు. యానాంలోని 18 పాఠశాలల్ని పునరావాస కేంద్రాలుగా మార్చి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలో నాగావళి నది ఉద్ధృతంగా ప్రవహించే అవకాశం ఉండటంతో పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను బూర్జ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు.

# వైసీపీ అభ్యర్థులకు ఆర్థికకష్టాలు

**కర్నూలు :** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచీ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వైఖరి, ఇప్పుడు క్షేత్రస్థాయి క్యాడర్‌ను తీవ్ర గందరగో ళంలోకి నెట్టేసింది. "రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోతోంది, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వడం లేదు అంటూ గవర్నర్‌కు ఫిర్యాదులు, మీడియా ముందు ప్రెస్‌మీట్లతో నానా హంగామా సృష్టించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. తీరా ఎన్నికల రణక్షేత్రం వేడెక్కుతున్న తరుణంలో యథావిధిగా బెంగళూరు ప్యాలెస్‌కు వెళ్లిపోయారు. అధినేత చేసిన ఆరోపణలకు పూర్తి భిన్నంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతానికి పైగా స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు యథేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేయడం, ఒకవైపు అసత్య ప్రచారాన్ని బట్టబయలు చేస్తూనే, మరోవైపు నాయకత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది.స్థానిక ఎన్నికల్లో ఎవరైనా ప్రత్యర్థులకు స్థానాలు ఏకగ్రీవం చేస్తే, భవిష్యత్ అసెంబ్లీ , సార్వత్రిక ఎన్నికల్లో వారికి ఎట్టిపరిస్థితుల్లోనూ పార్టీ టికెట్లు ఇచ్చేది లేదని జగన్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. దీంతో తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు కొందరు, మరికొందరు స్థానిక టీడీపీ నేతలతో తెరవెనుక చర్చలు జరిపి వ్యక్తిగత ప్రయోజనాలు , హామీలు పొందే వ్యూహంతో నామినేషన్లు వేయించినట్లు స్పష్టమవుతోంది. నామినేషన్ల సంఖ్య భారీగానే కనిపించినప్పటికీ, అందులో ప్రజాబలంతో పాటు అంతర్గత బేరసారాల వ్యూహాలే ఎక్కువ పాత్ర పోషించాయన్న వాదన బలంగా వినిపిస్తోంది.నామినేషన్లు వేయడం ఒక ఎత్తైతే, ఆ తర్వాత సీరియస్‌గా బరిలో నిలబడి ప్రజల్లోకి వెళ్లాలనుకున్న



అసలైన క్యాడర్ పరిస్థితి మాత్రం దయనీయంగా మారిపోయింది. పోరుబాట పట్టిన అభ్యర్థులను వెనకుండి నడిపించే నాథుడే కరువయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు అన్నీ అనుభవించి, కోట్లాది రూపాయల పదవులు అనుభవించిన జిల్లా స్థాయి ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇప్పుడు ముఖం చాటేశారు. తమ సొంత ఇలాకాల్లో సైతం ఎన్నికల ఖర్చులకు రూపాయి విదల్చకుండా చేతులెత్తేశారు. కనీసం బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవడానికి, రోజువారీ ప్రచార రథాలు, కరపత్రాల ముద్రణకు కూడా జిల్లా నాయకత్వం నుంచి నయాపైసా ఆర్థిక సాయం అందకపోవడంతో క్షేత్రస్థాయి నాయకులు దిక్కుతోచని స్థితిలో ఒంటరి పోరాటం చేయాల్సి వస్తోంది.ముఖ్యంగా ప్రతిష్ఠాత్మక నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, కడప వంటి మున్సిపల్ కార్పొరేషన్లలో పార్టీ తరఫున మేయర్ రేసులో నిలిచిన అభ్యర్థుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కార్పొరేషన్ స్థాయి ప్రచారం అంటే లక్షల్లో, కోట్లల్లో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఆర్థికంగా దెబ్బతిన్న అభ్యర్థులు సొంత జేబుల్లోంచి నిధులు పెట్టే సాహసం చేయలేకపోతున్నారు. అటు పార్టీ పెద్దల నుంచి ఎటువంటి చేయూత లభించడం లేదు. దీనితో వీధుల్లో నామమాత్రపు మైకులతో తిరుగుతూ ప్రచారం చేస్తున్నామా లేదా అన్నట్లుగా కాలం వెళ్లదీస్తున్నారు. అధిష్ఠానం బెంగళూరులో కూర్చుని సోషల్ మీడియా ట్వీట్లతో సరిపెడుతుంటే, క్షేత్రస్థాయిలో తాము ఎందుకు బలపడాలన్న అసహనం అభ్యర్థుల్లో పెల్లుబుకుతోంది.ఈ ఆర్థిక స్తోమత లేమి, నాయకత్వపు అలసత్వం వెరసి చివరికి చాలా చోట్ల వైసీపీ అభ్యర్థులు అధికార కూటమి నేతలతో లాలూచీ పడే దిశగా అడుగులు వేయిస్తోంది. గెలిచే అవకాశాలు లేనప్పుడు సొంత ఆస్తులు అమ్ముకుని ఎన్నికల్లో తగలబెట్టడం కంటే.. అధికార పక్షంతో ఏదో ఒక రూపంలో సర్దుబాటు చేసుకుని నిశ్శబ్దంగా ఉండటమే శ్రేయస్కరమని పలువురు కౌన్సిలర్, కార్పొరేటర్ అభ్యర్థులు నిర్ణయించుకుంటున్నారు. ఎన్నికలను కేవలం రాజకీయ ప్రతీకార ప్రకటనలకే పరిమితం చేసి, పోరాడే సైనికులకు కవచాన్ని, ఆయుధాలను అందించని అధిష్ఠాన వైఖరి వల్లే ఈ పరిస్థితి దాపురించింది.

## ప్రజల ప్రాణ రక్షణే ప్రథమ లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

రూరల్, కరప, తొండంగి మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆరు తీర ప్రాంత మండలాల పరిధిలో గుర్తించిన 50 గ్రామాలు, లోతట్టు ప్రాంతాల కలిపి మొత్తం 92 ఆవాసాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. మొత్తం 15 వేల మందికి పైగా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయగా, సాయంత్రంలోపు ప్రజలందరినీ సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని, అందుకోసం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు.

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ముఖ్యంగా సముద్ర తీరానికి మూడు నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలోని పూరిళ్లు, రేకుల ఇళ్లు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్న వారిని ముందుగా తరలించాలన్నారు. పునరావాస కేంద్రంలో తాగునీరు, పరిశుభ్రమైన ఆహారం, విద్యుత్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, దుప్పట్లు, చిన్నారులకు పాలు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్?లో నాలుగు రోజుల పాటు సిబ్బంది మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా ప్రత్యేక బాధ్యులను నియమించి సహాయక చర్యలను పర్యవేక్షించాలని చెప్పారు. వర్షాలకు రహదారులు దెబ్బతిన్నా, కల్వర్టులు కొట్టుకుపోయినా వెంటనే స్పందించాలని, ప్రమాదకరమైన రహదారులు, లోలెవల్ కాజ్‌వేల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. తుఫాను సమయంలోనూ ప్రజలకు సురక్షిత తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. గ్రామీణ తాగునీటి పథకాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లు చేయాలని, పునరావాస కేంద్రాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని కలెక్టర్?కు ఆదేశాలిచ్చారు. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే అత్యవసర కంట్రోల్ రూమ్‌తో పాటు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాల యాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూముల ద్వారా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే లక్ష్యం!




-మొదటిపేజీ తరువాయి

కూటమి అగ్రనేతల మీడియా సమావేశంలో ముగ్గురు నాయకులు స్థానిక ఎన్నికలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనే చర్యలపై మాట్లాడారు.

### ప్రజల హామీలను నెరవేర్చాం: చంద్రబాబు

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని, అందుకే స్థానిక ఎన్నికల్లో ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. బాధ్యతాయుతమైన నాయకత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని విమర్శించిన ఆయన, రాష్ట్ర పునర్నిర్మాణమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోర్టులను ఆశ్రయించిందని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై వైఎస్సార్‌సీపీ స్పందనను విడిగా పరిగణించాల్సి ఉంటుంది.

గత ఎన్నికల్లో కూటమి సాధించిన 94 శాతం స్ట్రైక్ రేట్ ప్రజల్లో ఉన్న మార్పు ఆకాంక్షను ప్రతిబింబించిందని చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమన్వయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు నమోదైనా నీటి వనరులను సమర్థంగా నిర్వహించి డెల్టా ప్రాంతానికి సాగునీరు అందించగలిగామని వివరించారు. అన్ని రిజర్వాయర్లలో నీటిని నిల్వ ఉంచి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కృష్ణా జలాలను రాయలసీమకు తరలించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### గ్రామ స్వరాజ్యానికి స్థానిక సంస్థలే పునాది: పవన్ కల్యాణ్

స్థానిక సంస్థలు బలోపేతమైతేనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. తన శాఖ పరిధిలో గత రెండున్నరేళ్లలో లక్షన్నర కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన పథకాలను పునరుద్ధరించామని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య సమన్వయం క్షేత్రస్థాయి వరకు కనిపించాలని పవన్ కల్యాణ్ సూచించారు. సీట్ల సర్దుబాటు ప్రక్రియలో సీఎం చంద్రబాబు చొరవ తీసుకున్నారని, అన్ని సవాళ్లను అధిగమించి మూడు పార్టీలు కలిసి ముందుకు సాగుతున్నాయని తెలిపారు. తుది జాబితా ప్రకారం బీఫామ్‌లు అందజేస్తామని, వాటిని పొందిన అభ్యర్థులే పోటీలో ఉండాలని స్పష్టం చేశారు. టికెట్లు దక్కని నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ఐక్యతకు ఎవరూ విఘాతం కలిగించవద్దని కోరారు. స్థానిక ఎన్నికల ఏర్పాట్లతో పాటు అర్నాబ్ తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పవన్ తెలిపారు. తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విపత్తుల సమయంలో ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

### 'చెప్పాం--చేస్తున్నాం' నినాదంతో ఎన్నికలకు: పీవీఎన్ మాధవ్

స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు సుదీర్ఘ చర్చల అనంతరం పూర్తయిందని, ప్రత్యర్థులు ఆశించినట్లుగా కూటమిలో విభేదాలకు అవకాశం ఇవ్వలేదని తెలిపారు. సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి సమన్వయంతో నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. 'చెప్పాం--చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని మాధవ్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని, అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి పనిచేస్తోందని తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మరింత సేవ అందిస్తామని చెప్పారు. స్థానిక స్థాయిలోనూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

### తుపాను ప్రభావంపై అప్రమత్తం

అర్నాబ్ తుపాను నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చంద్రబాబు తెలిపారు. తుపాను ప్రభావంతో నష్టం తగ్గించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు వంటి సవాళ్లను సమష్టి కృషితో అధిగమించాలని అన్నారు. స్థానిక ఎన్నికల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని కూటమి నేతలు తెలిపారు. పార్టీల మధ్య ఐక్యతను క్షేత్రస్థాయిలోనూ కొనసాగిస్తూ ప్రజల మద్దతుతో ఎన్నికలను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

# కేంద్ర ప్రభుత్వ సహకారంతో గుంటూరు అభివృద్ధికి భారీగా నిధులు.




- గుంటూరు పార్లమెంట్ పరిధిలో రూ.700 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం.
- నందివెలుగు ఆర్ఓబీ నవంబర్ నెలాఖరుకు ప్రారంభానికి సిద్ధం: డా. పెమ్మసాని చంద్రశేఖర్.

**గుంటూరు, పెన్ సత్తా, అక్టోబర్ 27**: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గుంటూరు ప్రాంతంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో దాదాపు రూ.700 కోట్లతో, 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో పలు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం లోని 41, 43 డివిజన్లలో మేయర్ అభ్యర్థిని కోవెలమూడి లక్ష్మీ అపర్ణ అలాగే కార్పొరేటర్ అభ్యర్థినులు అయిన రంగావజ్జుల గాయత్రి, బెహరా గాయత్రి లకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి తో కలిసి గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని ప్రచార కార్యక్రమాల్లో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నందివెలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు పూర్తి కావస్తున్నాయని, నవంబర్ నెలాఖరు లోగా ప్రారంభోత్సవం చేసుకునేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు అందించగా, భూ సేకరణ కోసం నగరపాలక సంస్థ నుంచి రూ.50 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మొత్తం రూ.150 కోట్లతో చేపట్టిన ఈ పనులను వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గడ్డిపాడు వద్ద రూ.150 కోట్లతో, పెదపలకలూరు వద్ద రూ.70 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. శ్యామలానగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించి రానున్న ఆరు నెలల్లో టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.15,000 కోట్ల మేర సహకారం అందించిందని డా. పెమ్మసాని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణం, అభివృద్ధితో పాటు గుంటూరు రైల్వే స్టేషన్‌ను ఆధునిక సదుపాయాలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర నిధులతో చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడుతూ, తయారీ రంగంలో స్వావలంబన దిశగా ముందుకు సాగుతోందని డా. పెమ్మసాని పేర్కొన్నారు. 2014 లో దేశంలో రెండు మొబైల్ ఫోన్ తయారీ యూనిట్లు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 300 కు పైగా తయారీ యూనిట్లు ఉన్నాయని వివరించారు. భారతదేశంలో తయారవుతున్న మొబైల్ ఫోన్లు దేశీయ అవసరాలను తీర్చడంతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. గుంటూరు అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించండి.

గుంటూరు నగరంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని డా. పెమ్మసాని తెలిపారు. కోవెలమూడి నాని మేయర్‌గా ఉన్న కాలంలో నగరంలోని పలు ప్రాంతాల్లో వందల కోట్ల రూపాయలతో రహదారులు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. మిగిలిన సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. గుంటూరు మేయర్ అభ్యర్థిని కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లగల నాయకురాలని అన్నారు. ఆమెతో పాటు కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం గుంటూరు అభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని గుర్తించి, కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా నగరానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి అవకాశం కల్పించాలని డా. పెమ్మసాని చంద్రశేఖర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కూటమి గెలుపే ధ్యేయంగా కలసి పని చేద్దాం పల్లా.




**గాజువాక, పెన్ సత్తా, అక్టోబర్ 27:** గాజువాక ఓ ప్రైవేటు హోటల్లో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన కూటమి కార్పొరేటర్ల పరిచయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విశాఖ ఎంపి శ్రీ భరత్, ఎంఎల్సి వేపాడ చిరంజీవి రావు, విశాఖ మేయర్ అభ్యర్థిని డాక్టర్ ముక్కా శ్రావణి, బిజెపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగ రావు(కేఎన్ఆర్), జనసేన గాజువాక ఇంచార్జి, డిసిసిబి ఛైర్మన్ కోన తాతారావు పాల్గొన్నారు. మొదట కార్పొరేటర్ అభ్యర్థులు పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎంపి శ్రీ భరత్, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, ఎంఎస్సీ చిరంజీవిరావు మాట్లాడుతూ ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. బిజెపి తరపున కరణంరెడ్డి నరసింగ రావు, జనసేన తరపున కోన తాతారావు అభ్యర్థుల గెలుపు కోసం మాట్లాడారు. రెబల్స్ గా పోటీ చేస్తున్న వారిని మూడు పార్టీల నుండి ఆయా ఇండిపెండెంట్ అభ్యర్థులను సస్పెండ్ చేయాలని మూడు పార్టీల నాయకులను కార్పొరేటర్ అభ్యర్థులు కోరారు. నూటికి నూరుశాతం స్ట్రైక్ రేట్ తో విజయం సాధించాలని , అందుకు తగిన విధంగా కూటమి నాయకులు కృషి చేయాలని కోరారు.

# తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి.

- కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- వెస్ట్, నార్త్ జోన్లలో పర్యటించి, సిటీ ఆపరేషన్స్ సెంటర్‌ను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.





**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 27:** విశాఖపట్నం నగరంలో తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన జీవీఎంసీ వెస్ట్, నార్త్ జోన్లలో పర్యటించి కొండవాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితులను పరిశీలించారు. వెస్ట్ జోన్‌లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసర మైన చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ బి. హేమావతిని ఆదేశించారు. నార్త్ జోన్ లోని 57 వ వార్డు ఇందిరానగర్--1లో జోనల్ కమిషనర్ బి. రాముతో కలిసి పర్యటించారు. జీవీఎంసీ కళ్యాణమండపం నిర్మాణం సమీపంలో మట్టి పెళ్లలు జారిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసర మైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలో ఉన్న నివాసితులతో మాట్లాడుతూ మూడు రోజులు పాటు భారీ వర్షాలు ఈదురు గాలులు వస్తున్నందున ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు సంభవించే అవకాశం లేకుండా జీవీఎంసీ తగిన చర్యలు చేపడుతుందని, అందుకు జీవీఎంసీ సూచించిన సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కమిషనర్ అక్కడి నివాస ప్రజలకు సూచించారు. ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ సహకరించాలని, ప్రాణాలకు ముప్పు కలిగించే ప్రాంతాల్లో ఉండకూడదని కమిషనర్ సూచించారు.

సిటీ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లోని సిటీ ఆపరేషన్స్ సెంటర్‌ను అదనపు కమిషనర్లు ఎస్.ఎస్. వర్మ, పల్లి నల్లనయ్య, ప్రధాన ఇంజనీర్ సత్యనారాయణ రాజుతో కలిసి కమిషనర్ సందర్శించి, నగరంలో వర్షాల పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా చెట్లు కూలిపోవడం, గెడ్డలు, కాలువలు పొంగిపొర్లడం, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు కూలిపోయే ప్రమాదాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని జోన్ల అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని స్పష్టం చేశారు. సిటీ ఆపరేషన్స్ సెంటర్‌కు అందే ప్రజా ఫిర్యాదులను తక్షణమే సంబంధిత అధికారులకు పంపించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మకు సూచించారు. అత్యవసర ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్, వాట్సాప్ నంబర్. వర్షాలు, తుఫాను ప్రభావానికి సంబంధించిన అత్యవసర సమస్యల పై ప్రజలు జీవీఎంసీ టోల్ ఫ్రీ నంబర్ 1800 4250 0009 కు వాట్సాప్ 90142 18870 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసిన పంచకర్ల





**పెందుర్తి, పెన్ సత్తా, అక్టోబర్ 27:** కూటమి బలపరిచిన జనసేన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు. మంగళవారం నాడు పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థులకు బి-ఫారాలు అందజేశారు. పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లోని వివిధ గ్రామాల్లో పోటీ చేస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ జనసేన అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసి, ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండలాల నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ అభ్యర్థి వెన్నెల నరసింహారావు కి బి-ఫామ్ అందించిన పంచకర్ల



**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 27:** వెన్నెలపాలెం గ్రామ కూటమి జనసేన ఎంపీటీసీ అభ్యర్థి వెన్నెల నరసింహా రావు కి పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు 'బి-ఫామ్' ను అందించారు. ఈ సందర్భంగా వెన్నెల నరసింహారావు మాట్లాడుతూ కూటమి నాయకత్వం తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వెన్నెలపాలెం గ్రామాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆయనకు అభినందనలు తెలిపి, ఎన్నికలలో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అభ్యర్థికి తమ మద్దతు తెలియజేశారు.

# జీవీఎంసీ 111 వ వార్డులో కొణతాల రామకృష్ణ విస్తృత ప్రచారం.

కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 27:** జీవీఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జీవీఎంసీ 111వ వార్డులో విస్తృత ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విజయరామరాజుపేట వీధులు, పరిసర ప్రాంతాల్లో కూటమి కార్పొరేటర్ అభ్యర్థి పలకా యశోద రవి గతో తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రజలను కలుసుకొని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లో కూటమి తరఫున ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 111 వ వార్డు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ మద్యం దుకాణాలు బంద్.

- అక్టోబర్ 30 సాయంత్రం నుంచి నవంబర్ 1 వరకు మూసివేత..
- నవంబర్ 3 న కూడా బంద్ కలెక్టర్.




**పుట్టపర్తి, పెన్ సత్తా, అక్టోబర్ 27:** శ్రీ సత్యసాయి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాల మూసివేతకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆదేశాల ప్రకారం, నవంబర్ 1 న పోలింగ్ జరిగే ప్రాంతాల్లో అక్టోబర్ 30 వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలి. అలాగే నవంబర్ 3 న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి సంబంధిత ప్రాంతాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలి. జిల్లా లోని ఆరు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. సంబంధిత ప్రాంతాల్లోని మద్యం దుకాణాల నిర్వాహకులు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నియమ నిబంధనలకు సహకరించాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం సూచించింది.

## మునగపాక మండలంలో వైసీపీకి భారీ ఎదురుదెబ్బ.

జనసేన పార్టీ లోకి..భారీగా చేరికలు.



**మునగపాక, పెన్ సత్తా, అక్టోబర్ 27:** అచ్యుతాపురం మండలం ఎస్ టి బి ఎల్. ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ నివాసం వద్ద జనసేన పార్టీలో చేరిన వైసీపీ నాయకులు. మునగపాక మండలం, నాగులపల్లి నుంచి వైసీపీ పార్టీ 10. కుటుంబాలు మల్ల దొరమ్మ నాయుడు, దొడ్డిభాస్కర్ రావు, మల్ల సుబ్బారావు, వేగి సుబ్బారావు, దొడ్డి నాయుడు, మొల్లేటి శివ, నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీ లోకి చేరారు. ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ వీరికి జనసేన పార్టీ కండువాలు వేసి పార్టీ లోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు,మునగపాక మండలంలో వైసీపీ నాయకులు జనసేన పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. నాయకులు మారుతున్నా జెండాలు మోసేది కార్యకర్త లేనా అంటూ వైసీపీలో రగులుతున్న అసంతృప్తి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస రావు, ఎల్లపు వెంకట్ భాస్కర రావు, ఆదిమూర్తి, నూకలయ్య, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదిరులు పాల్గొన్నారు.

## వమ్మివరం పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులకు భరోసానిచ్చిన జిల్లా కలెక్టర్







**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 27:** ఎస్. రాయవరం మండలం వమ్మివరం గ్రామంలో తుఫాను పునరావాస కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్. ఈ సందర్భంగా ఆశ్రయం పొందుతున్న తుఫాను బాధితులతో కలెక్టర్ మాట్లాడుతూ వారి సమస్యలను, క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. ?పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు అందుతున్న ఆహారం, మంచినీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా పై ఆరా తీశారు. అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ? తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలెవ్వరూ ధైర్యం కోల్పోవద్దని, ప్రభుత్వం, యంత్రాంగం అన్ని విధాలా అండగా ఉంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు. రక్షిత కేంద్రంలో ఉన్న ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు సోకకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న పసిపిల్లలు, గర్భిణులు మరియు వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తో పాటు జిల్లా అధికారులు పాల్గొనడం అయినది.

# కూటమి అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసిన యార్లగడ్డ.

- జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ.
- అభ్యర్థుల ఎంపికలో బీసీలకు 28.6 శాతం ప్రాధాన్యం యార్లగడ్డ.
- గత ఎన్నికల్లో ప్రలోభాలు, బెదిరింపులతో ఏకగ్రీవాలు చేశారని వ్యాఖ్య.
- ప్రస్తుత ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా పోటీకి అవకాశం కల్పించాం.
- వైసీపీ అభ్యర్థులు కూడా అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేస్తున్నారు.
- ఎక్కడా నామినేషన్లను అడ్డుకోలేదు, తప్పుడు కేసులు పెట్టలేదు యార్లగడ్డ.
- టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి యార్లగడ్డ.
- గన్నవరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం.. కక్ష సాధింపు రాజకీయాలకు దూరం.











**గన్నవరం, పెన్ సత్తా, అక్టోబర్ 27:** ప్రజాస్వామ్య పద్ధతి లోనే ఎన్నికలు, అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలి అన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు. గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఏకగ్రీవాల కోసం ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడ్డారని, ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో అటువంటి రాజకీయాలకు తావులేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలకు వెళ్తున్నామని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేస్తున్నారని, ఎక్కడా నామినేషన్లను అడ్డు కోలేదని చెప్పారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, అధికారాన్ని అడ్డు పెట్టుకొని ప్రత్యర్థుల గొంతు నొక్కడం తన విధానం కాదని పేర్కొన్నారు. మంగళవారం గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన 91 మంది ఎంపీటీసీ, నలుగురు జడ్పీటీసీ అభ్యర్థులకు టీడీపీ బి-ఫారాలు అందజేశారు. జనసేన, బీజేపీ అభ్యర్థులకు ఆయా పార్టీల కార్యాలయాల్లో బి-ఫారాలు అందించినట్లు తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో బీసీలకు 28.6 శాతం ప్రాధాన్యం కల్పించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయిందని, తొలిసారిగా స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొంటున్నానని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం నియోజకవర్గానికి పూర్వ వైభవం తీసుకురావాలని, అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. నియోజకవర్గంలో పాదయాత్ర చేసినప్పటి నుంచి ఎన్నికల వరకు జరిగిన పరిణామాలు ప్రజలకు తెలుసన్నారు. కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్‌గా ఉన్న సమయంలోనూ నియోజకవర్గానికి మేలు చేయలేకపోయానని పేర్కొన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రలోభాలు, బెదిరింపులతో ఏకగ్రీవాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా అప్పటి పరిస్థితులు గన్నవరంలో ఉన్నాయని చెప్పారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని, ప్రతి అభ్యర్థికి పోటీ చేసే అవకాశం కల్పించామని స్పష్టం చేశారు. మాటల్లో ప్రజాస్వామ్యం గురించి చెప్పడం కాదు, చేతల్లో చూపించాలన్నదే తన విధానమని తెలిపారు. వైసీపీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నారని, ఎక్కడా నామినేషన్లను అడ్డుకోలేదని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పోలీసులను ఉపయోగించి తప్పుడు కేసులు పెట్టడం, ప్రత్యర్థులను భయపెట్టడం, బలవంతంగా ఏకగ్రీవాలు చేయించడం వంటి చర్యలకు తాను పాల్పడలేదని స్పష్టం చేశారు. గతంలో తనపై ఎస్సీ, ఎస్టీ కేసులు, హత్యాయత్నం కేసులు నమోదైనా రాజకీయ ప్రత్యర్థుల పై తప్పుడు కేసులు పెట్టే విధానాన్ని అనుసరించ లేదన్నారు. తన పై విమర్శలు చేసే వారిని అధికార బలంతో అణచివేయవచ్చని, అయినా అలా చేయడం ప్రజాస్వామ్యం కాదని వ్యాఖ్యానించారు. సద్విమర్శలను స్వీకరించే సంస్కారం ఉండాలని, రాజకీయాల్లో ప్రత్యర్థులు ఉంటారే తప్ప వ్యక్తిగత శత్రుత్వాలకు తావుండకూడదని పేర్కొన్నారు. అబ్రహం లింకన్ ప్రజాస్వామ్య స్ఫూర్తిని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ ఆశయాలను ఆచరణలో చూపించాలన్నారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం కంటే ఆయన ఆశయాలను పాటించడం ముఖ్యమని హితవు పలికారు. ఎన్డీఏ కూటమిలో మిత్రధర్మాన్ని పాటిస్తూ సీట్ల కేటాయింపు చేపట్టామని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బీజేపీకి నాలుగు జడ్పీటీసీ స్థానాల్లో రెండింటిని కేటాయించామని, గన్నవరం, విజయవాడ రూరల్ జడ్పీటీసీ స్థానాలను ఆ పార్టీకి ఇచ్చామని చెప్పారు. జనసేనకు 17 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక ఎంపీపీ అభ్యర్థిత్వాన్ని కేటాయించామన్నారు. ఎస్సీ రిజర్వేషన్ ఉన్న బాపులపాడు మండలంలో జనసేనకు ఎంపీపీ అభ్యర్థిగా అవకాశం కల్పించినట్లు వివరించారు. పార్టీ కోసం కష్టపడిన క్షేత్రస్థాయి నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలో తెలుగు యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పరుచూరి నరేష్‌ను ఎంపీపీ అభ్యర్థిగా ప్రకటించామన్నారు. ఉంగుటూరు మండలంలో తుమ్మల జగదీష్‌ను ఎంపీటీసీ అభ్యర్థిగా నిలిపామని, మండల పార్టీ అధ్యక్షుడు కొలుసు రవీంద్ర, పెద్ద అవుటపల్లికి చెందిన సీనియర్ నాయకుడు మారీదు రాంబాబు పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఇతర నియోజకవర్గాల్లో సీట్ల కేటాయింపుపై కూటమి పార్టీల మధ్య వివాదాలు తలెత్తినా, గన్నవరంలో మూడు పార్టీలు సమన్వయంతో నిర్ణయాలు తీసుకున్నాయని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఒకే కుటుంబంలా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలు కూటమి ఆధ్వర్యంలో ఉంటే నియోజకవర్గ అభివృద్ధిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లవచ్చని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గ్రామాల్లో చెత్త సమస్య, తాగునీటి సమస్యలతోపాటు మౌలిక సదుపాయాల కొరతను పరిష్కరించేందుకు స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయం అవసరమన్నారు. అభివృద్ధికి రాజకీయాలు అడ్డుపడకూడదని వ్యాఖ్యానించారు. గన్నవరం నియోజకవర్గంలో 250 ఓట్లున్న గ్రామ పంచాయతీ నుంచి 24 వేల ఓట్లున్న పంచాయతీ వరకు ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామాన్ని సమానంగా అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. రాబోయే సర్పంచి ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులకు కార్యకర్తలు మద్దతుగా నిలవాలని కోరారు. విజయవాడ రూరల్ మండలంలోని ఎనిమిది గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని యార్లగడ్డ వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. గూడవల్లిలో మినహా మిగతా గ్రామాల్లో అధిక టీడీఎస్ ఉన్న నీటిని వినియోగించాల్సిన పరిస్థితి ఉండటం బాధాకరమన్నారు. గన్నవరం నియోజకవర్గం నుండి అనేక మంది ఎమ్మెల్యేలుగా గెలిచినా ఈ సమస్య పరిష్కారం కాకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఈ పరిస్థితిపై తాను సిగ్గుపడుతున్నానని వ్యాఖ్యానించారు. కృష్ణా నది నుంచి ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేయాలంటే సుమారు రూ.200 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రత్యామ్నాయంగా సుమారు రూ.2 కోట్లతో ఎనిమిది గ్రామాలకు తాగునీరు అందించే మార్గాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లానన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. విజయవాడ రూరల్ మండలంలోని తొమ్మిది గ్రామాలను విజయవాడ నగరపాలక సంస్థలో విలీనం చేయడం ద్వారా తాగునీరు, చెత్త నిర్వహణ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ గ్రామాలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తానని తెలిపారు. గత ఎన్నికల్లో 84 పంచాయతీల్లో 70 పంచాయతీల్లో తనకు మెజారిటీ వచ్చిందని, ఈసారి అంతకంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గన్నవరం నియోజకవర్గం నుంచి చంద్రబాబునాయుడికి, ఎన్టీఆర్ కుటుంబానికి గతంలో జరిగిన అవమానాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు మనోవేదనకు గురైన పరిణామాలను ప్రజలు గుర్తుంచు కోవాలని కోరారు. కూటమి అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించి చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర నాయకత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి విజయాన్ని కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని యార్లగడ్డ వెంకట్రావు ప్రజలను కోరారు. అటు వైపు బాపులపాడు మండలంలోని మడిచర్ల నుంచి ఇటు నియోజకవర్గంలోని అంబాపురం వరకు ప్రతి గ్రామంలో కూటమి జెండా ఎగరాలని ఆకాంక్షించారు. టీడీపీ కార్యకర్తలు సైకిల్ గుర్తును, జనసేన కార్యకర్తలు గాజు గ్లాసు గుర్తును, బీజేపీ కార్యకర్తలు కమలం గుర్తును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి కోసం పనిచేస్తానని, కక్ష సాధింపు రాజకీయాలకు దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక సంస్థల సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు. నియోజకవర్గంలోని ఓటర్లందరూ కూటమి అభ్యర్థులను బలపరిచి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# జోరు వానలో తీర ప్రాంతాల్లో పర్యటించిన హోంమంత్రి అనిత.



- రేవుపోలవరం, బోయపాడు గ్రామాల్లో పునరావాస కేంద్రాల పరిశీలన.
- తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలి.
- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి.. అధికారుల సూచనలు పాటించాలి మంత్రి అనిత.





**నక్కపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 27:** అర్నబ్ తుపాను నేపథ్యంలో హోంమంత్రి వంగలపూడి అనిత జోరువానలో పాయకరావుపేట నియోజకవర్గం లోని తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. యస్.రాయవరం మండలం రేవుపోలవరం, నక్కపల్లి మండలం బోయపాడు గ్రామాల్లో తుపాను ముందస్తు చర్యలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి, అక్కడి ఏర్పాట్లు, ప్రజలకు కల్పిస్తున్న వసతుల పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో వసతుల పై ఆరా. రేవుపోలవరం గ్రామం లోని పునరావాస కేంద్రంలో స్థానికులతో మాట్లాడిన హోంమంత్రి అనిత.. తుపాను నేపథ్యంలో వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో అవసర మైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని అధికారులను ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం రేవుపోలవరం తీరానికి చేరుకున్న మంత్రి మత్స్యకారులతో మాట్లాడారు. తుపాను తీవ్రత, బలమైన గాలుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, సముద్రం లోకి చేపల వేటకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కోరారు. బోయపాడు తుపాను రక్షణ భవనంలో పునరావాస కేంద్రం పరిశీలన: నక్కపల్లి మండలం బోయపాడు గ్రామంలో తుపాను రక్షణ భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని హోంమంత్రి పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల భద్రత కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, తుపాను సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తుపాను తీరాన్ని దాటే సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన మంత్రి: నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను హోంమంత్రి అనిత సందర్శించారు. తుపాను పరిస్థితులు, అధికార యంత్రాంగం చేపడుతున్న ముందస్తు చర్యలను పరిశీలించి, అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. తీర ప్రాంత గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రజలకు అవసర మైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. తుపాను ప్రభావం తగ్గే వరకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలంతా అధికారుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, అనవసరంగా బయటకు రావద్దని హోంమంత్రి అనిత విజ్ఞప్తి చేశారు.

# అనంతలో ఎంపీ పురందేశ్వరి ప్రచారం.





- సప్తగిరి సర్కిల్ నుంచి విద్యుత్ నగర్ సర్కిల్ వరకు రోడ్ షో.
- పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు, కూటమి నాయకులు.
- డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి సాధ్యం.. పురందేశ్వరి.
- ఈ ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పాలన్న దగ్గుపాటి ప్రసాద్.

**అనంతపురం, పెన్ సత్తా, అక్టోబర్ 27:** డబుల్ ఇంజన్ సర్కార్ లో జరుగుతున్న అభివృద్ధి మరింతగా కొనసాగాలంటే.. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె అనంతపురంలో పర్యటించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన రోడ్ షోలో ఆమె పాల్గొన్నారు. ఈ రోడ్ షో నందు ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, మేయర్ అభ్యర్థి అజేష్ బాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, సప్తగిరి సర్కిల్ నుండి విద్యుత్ నగర్ సర్కిల్ వరకు నిర్వహించిన రోడ్ షోకు ప్రజల నుండి అనూహ్య స్పందన కనిపించింది. కూటమి నాయకులు కూడా ఈ ప్రచారంలో భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు, విధ్వంసకర పాలన సాగిందని మండి పడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్‌ను గెలిపిస్తే ఆంధ్రప్రదేశ్ అక్షర క్రమం లోనే కాదు, అభివృద్ధి లోనూ అగ్రగామిగా నిలుస్తుందని నాడు చెప్పామన్నారు. ప్రజలు ఆశీర్వదించి ఊహించని స్థాయిలో మెజార్టీ ఇచ్చారన్నారు. నేడు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల త్రిశక్తి నేతృత్వంలో ఆ అభివృద్ధి కళ్ళముందే జరుగుతోందని స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు కియా పరిశ్రమను అనంతపురానికి తీసుకొస్తే, నేడు 57 వేల కోట్ల రూపాయల మోటార్ వెహికల్ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. జిల్లా నేడు విండ్, సోలార్ ఎనర్జీతో పాటు పారిశ్రామిక పరికరాల తయారీ కేంద్రంగా మారుతోందన్నారు. ఎన్డీఏ అధికారం లోకి వచ్చాక అనంతపురంలో ఉద్యాన పంటలైన అరటి తదితర ఉత్పత్తులు విదేశాలకు సైతం ఎగుమతి అయ్యాయని, కిసాన్ రైలు ద్వారా రైతులకు ఎంతో మేలు జరిగిందని వివరించారు. అమృత్ 2 స్కీమ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రహదారుల నిర్మాణాలకు కేంద్రం ఇస్తున్న నిధులను కూటమి ప్రభుత్వం అందిపుచ్చుకుంటోందని చెప్పారు. గత ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన 145 కోట్ల మంచినీటి నిధులలో కేవలం 75 కోట్లు ఖర్చు పెట్టి మిగిలినవి దారిమళ్లించి ప్రజలను వంచించిందని ధ్వజమెత్తారు. అనంతపురం అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్రంలో అగ్రగామిగా నిలబడాలన్నా బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ బాబు ని, 62 డివిజన్లలోని ఎన్డీఏ కూటమి అభ్యర్థులందరినీ గెలిపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో రెండున్నరేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. గతంలో గొడ్డలి పార్టీ విధానాలతో రాష్ట్రంతో పాటు అనంతపురం వెనుకబడిందన్నారు. కేంద్రం, రాష్ట్రం, స్థానికంగా ఒకే ప్రభుత్వం ఉంటుందని, అందుకే కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మోదీ ఆలోచన, చంద్రబాబు యుక్తి, పవన్ కల్యాణ్ శక్తి తోనే ఏపీ అభివృద్ధి.





- అదే అభివృద్ధి కొనసాగాలంటే కూటమిని గెలిపించండి.
- అనంతపురం నగర ప్రజలకు పిలుపునిచ్చిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి.
- అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటితో కలిసి మీడియా సమావేశం.
- నగర రూపురేఖలు మార్చేలా కూటమి మ్యానిఫెస్టో ఉందన్న పురందేశ్వరి.
- వైసీపీకి ఓటు వేస్తే బురదలోకి వేసినట్టే.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్,

**అనంతపురం, పెన్ సత్తా, అక్టోబర్ 27**: ప్రధాన మంత్రి మోదీ ఆలోచన, ముఖ్యమంత్రి చంద్రబాబు యుక్తి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శక్తి తోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో పాలన సాగుతోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆమె ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మంత్రి సత్యకుమార్, మేయర్ అభ్యర్థి అజేష్ బాబు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. నగరంలో ప్రచారం, కూటమి మ్యానిఫెస్టోను వివరించారు. 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో విధ్వంసకర, విద్వేషపూరిత మైన పాలనతో అభివృద్ధి పూర్తిగా గాడి తప్పిందని పురందేశ్వరి మండి పడ్డారు. మళ్లీ రాష్ట్రాన్ని ప్రగతి పథం లోకి తెస్తామన్న నమ్మకంతోనే ప్రజలు కూటమికి అఖండ మైన మెజారిటీతో పట్టం కట్టారన్నారు. గత రెండున్నరేళ్లుగా ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని చెప్పారు. మోదీ ఆలోచనా శక్తి, చంద్రబాబు యుక్తి, పవన్ కళ్యాణ్ శక్తి.. ఈ మూడు శక్తులు కలవడం వల్లే రాష్ట్రం వేగంగా ముందుకు సాగుతోందని కొనియాడారు. 2019-24 మధ్య వైసిపి ప్రభుత్వం అమృత్-1 పథకం కింద కేంద్రం ఇచ్చిన రూ. 175 కోట్లలో కేవలం రూ. 65 కోట్లు మాత్రమే వాడి మిగిలిన నిధులను ఏం చేసిందో తెలియదని, అప్పట్లో జరిగిన అభివృద్ధి కేవలం వైసీపీ నాయకుల జేబులకే పరిమిత మైందని ధ్వజమెత్తారు. కానీ తమ కూటమి ప్రభుత్వం ఈ రెండున్నరేళ్ల లోనే అనంతపురం తాగునీటి ప్రాజెక్ట్ కోసం రూ.700 కోట్లు కేటాయించిందన్నారు. ఇందులో కేంద్రం ఇచ్చిన రూ.400 కోట్లతో పాటు రూ. 300 కోట్ల బ్యాంక్ నిధులను కూడా తీసుకొచ్చామని వెల్లడించారు. నగర డ్రైనేజీ వ్యవస్థకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వకపోగా, ప్రస్తుతం తమ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని వివరించారు. వైసిపి పాలనలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, కూటమి వచ్చాక రేమాండ్స్ లాంటి మూడు పెద్ద పరిశ్రమలు వచ్చాయన్నారు. కిసాన్ రైలు ద్వారా ఈ ప్రాంత ఉద్యాన పంటలైన అరటి, దానిమ్మలను 85 శాతం ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ రైతులకు అండగా నిలిచామని చెప్పారు. 'అణగదొక్కిన వారికి నేనున్నా' అనే పవన్ తత్వం, 'సమాజమే దేవాలయం' అనే టీడీపీ సిద్ధాంతం, 'సబ్ కా వికాస్' అనే మోదీ నినాదంతో కూటమి ముందుకు సాగుతోందన్నారు. 62 డివిజన్లలో అభ్యర్థులతో పాటు మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రమించే నైజం ఉన్న యువకుడు అజేష్ బాబును ఆశీర్వదించాలని కోరారు. కూటమి విడుదల చేసిన మేనిఫెస్టో ప్రకారం అనంత సాగరం చెరువును ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామని, డంపింగ్ యార్డ్ రహిత నగరంగా మారుస్తామని భరోసా ఇచ్చారు. నామినేషన్లు చించేశారంటూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని, గతంలో వారు నేర్పిన విద్యలనే ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఓటమి భయంతోనే ఆడలేక మద్దెల అన్న చందంగా వారు ఇలా ఏడుస్తున్నారని పురందేశ్వరి ఎద్దేవా చేశారు.

ప్రజా స్పందన అద్భుతంగా ఉంది, మా విజయం ఖాయం..ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వారం రోజులుగా తాము నగరంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించామని. ప్రజల నుంచి అద్భుత మైన స్పందన వచ్చిందని తెలిపారు. తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూపే ఓట్లు అడుగుతున్నామని, గత గొడ్డలి పార్టీ లాగా దౌర్జన్యాలు, దాడులు చేసి ఏకగ్రీవాలు చేసుకోవాలనే ఆలోచన తమకు లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పులివెందుల, పుంగనూరు వంటి వైసిపి ఎమ్మెల్యేలు ఉన్న చోట్లే గొడవలు, అలజడులు జరుగుతున్నాయని విమర్శించారు. అనంతపురంలో మత కలహాలు సృష్టించడానికి వైసీపీ కుట్రలు పన్నినా తాము ఎంతో సంయమనంతో వ్యవహరించామని చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ అధికారంలో ఉందని, నగరంలో కూడా కూటమి మేయర్ అభ్యర్థి అజేష్ బాబు గెలిస్తే ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధతో అనంతపురానికి ట్యాంక్ బండ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్ లాంటి భారీ ప్రాజెక్టులు వస్తాయని స్పష్టం చేశారు. పొరపాటున గొడ్డలి పార్టీకి ఓటు వేస్తే అది బురదలో పోసినట్టే అవుతుందన్నారు. రాష్ట్రంలో కేవలం 11 సీట్లు ఉన్న ఆ పార్టీ నేతలు ఎలాంటి నిధులు తీసుకురాలేరని గుర్తుచేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ స్థానంతో పాటు 62 డివిజన్లలోనూ కూటమి చారిత్రాత్మక విజయం సాధించబోతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పించండి!

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో బండి జయప్రకాష్
తొగట చేనేత కుటుంబం నుంచి ఎన్నికల పోరు..
ఇంటింటి ప్రచారంతో ఓటర్లను కలుస్తున్న యువ అభ్యర్థి

**ధర్మవరం అక్టోబర్ 27 (పెన్ సత్తా)** ధర్మవరం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో స్వతంత్ర అభ్యర్థిగా బండి జయప్రకాష్ ఎన్నికల బరిలో నిలిచారు.తొగట చేనేత కుటుంబానికి చెందిన విద్యావంతుడైన యువకుడిగా తనకు ఒక అవకాశం కల్పించాలని కోరుతూ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

**ప్రజాసేవే లక్ష్యంగా ముందడుగు**

బండి కుటుంబం గత కొన్నేళ్లుగా చేనేత కార్మికుల సంక్షేమంతో పాటు పట్టణ ప్రజలకు వివిధ సేవా కార్యక్రమాల ద్వారా అండగా నిలిచిందని జయప్రకాష్ తెలిపారు.తమ కుటుంబం చేసిన సేవలను గుర్తించి, యువతకు ప్రజాసేవలో అవకాశం కల్పించాలని చేనేత కుటుంబ సభ్యులతో పాటు పట్టణ ఓటర్లను కోరుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వివిధ పార్టీల అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తుండగా, జయప్రకాష్ స్వతంత్ర అభ్యర్థిగా తనదైన శైలిలో ఓటర్లను కలుస్తూ మద్దతు కోరుతున్నారు. యువతకు అవకాశం కల్పిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.




**కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో ప్రచారం**

తన ఎన్నికల ప్రచారానికి కుటుంబ సభ్యులు,స్నేహితులు సహకరిస్తూ విజయానికి కృషి చేస్తున్నారని జయప్రకాష్ పేర్కొన్నారు.తనకు మద్దతుగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.యువతకు ఒక అవకాశం కల్పించి, తనను ఆదరించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

## జాతీయ రహదారి పై రాత్రి 9:00 గంటల తర్వాత వాహనాల రాకపోకల పై ఆంక్షలు.

- 'ఆర్నబ్' తుఫాను తీవ్రత దృష్ట్యా ఆంక్షలు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 27:** 'ఆర్నబ్' తుఫాను ఈరోజు రాత్రి మరింత ఉధృతరూపం దాల్చే అవకాశం ఉన్నందున, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణార్థం జాతీయ రహదారి పై వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు జారీ చేశారు. రవాణా ఆంక్షలు: నేటి రాత్రి 9:00 గంటల తర్వాత ఎన్.హెచ్-16 మార్గంలో తుని వైపు నుంచి అనకాపల్లి మీదుగా వెళ్లే వాహనాలు, అలాగే విశాఖపట్నం, సబ్బవరం మీదుగా తుని వైపు వెళ్లే అన్ని రకాల వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుంది. పోలీస్ యంత్రాంగానికి ఆదేశాలు: సంబంధిత హైవే పరిధి లోని పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, హైవే పెట్రోలింగ్, మొబైల్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, వాహనాలను ఎక్కడికక్కడ సురక్షిత ప్రాంతాల్లో నిలిపివేసేలా పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు విజ్ఞప్తి: తుఫాను తీరం దాటే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర మైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని జిల్లా ఎస్పీ కోరారు. అత్యవసర సహాయం కొరకు సంప్రదించవలసిన నంబర్లు: ఏదైనా ఆపద లేదా సహాయం అవసర మైతే వెంటనే స్థానిక పోలీసులను గానీ, లేదా క్రింది నంబర్లను గానీ సంప్రదించగలరు: ?అత్యవసర విభాగం: డయల్ 112, 100, ?జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్: 94409 04229.

## ధర్మవరం 40వ వార్డులో టీడీపీ అభ్యర్థి నర్రావుల ఆదినారాయణ (కొత్తపేట ఆది) గెలుపే లక్ష్యంగా ప్రచారం

- టీడీపీ అభ్యర్థి ఆదినారాయణకు మద్దతుగా మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించిన భార్య నర్రావుల లక్ష్మి
- 40వ వార్డులో ఇంటింటి ప్రచారం.. భారీ సంఖ్యలో పాల్గొన్న మహిళలు.. ఆదినారాయణను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి



**ధర్మవరం,అక్టోబర్ 27 (పెన్ సత్తా)**శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని 40వ వార్డులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నర్రావుల ఆదినారాయణ (కొత్తపేట ఆది) గెలుపే లక్ష్యంగా ఆయన భార్య నర్రావుల లక్ష్మి మహిళలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచార కార్యక్రమంలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు.
ఈ సందర్భంగా వార్డులోని మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నర్రావుల ఆదినారాయణకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు.మహిళలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొనడంతో వార్డులో ఎన్నికల సందడి నెలకొంది. ఆదినారాయణ విజయమే లక్ష్యంగా మహిళలు ఉత్సాహంగా ప్రచారాన్ని కొనసాగించారు.

## మరోసారి కౌన్సిలర్‌గా గెలిపించండి

- 40వ వార్డు ప్రజలకు వైసీపీ అభ్యర్థి చందమూరి నారాయణరెడ్డి విజ్ఞప్తి



**ధర్మవరం,అక్టోబర్ 27 (పెన్ సత్తా)**ధర్మవరం మున్సిపాలిటీ 40వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అభ్యర్థి చందమూరి నారాయణరెడ్డి మరోసారి తనను గెలిపించాలని వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిశారు.గత ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు గత ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు.కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను కొనసాగించారని పేర్కొన్నారు.
గతంలో 41వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేసిన సమయంలో వార్డు అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. ప్రస్తుతం 40వ వార్డు నుంచి పోటీ చేస్తున్న తనకు మరోసారి అవకాశం కల్పించి, అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గెలిపిస్తే వార్డు అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అధికారులు విస్తృత తనిఖీలు

**చోడవరం రూరల్,అక్టోబరు27 పెన్ సత్తా...** స్థానిక ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్ అధికారులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. చోడవరం సీఐ కెవి పాపునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ లు, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది వాహనాలు తనిఖీలు చేసి అక్రమ మద్యం పై నిఘా పెట్టారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్




**ధర్మవరం అక్టోబర్ 27 (పెన్ సత్తా)** ధర్మవరం మున్సిపల్,ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ధర్మవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అడిషనల్ ఎస్పీ కె.వి. మహేష్,ధర్మవరం డీఎస్పీ బి.వి. జగన్నాథ్ రాజుతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలైన గూడ్స్ కొట్టాలు,రాజేంద్రనగర్ తదితర ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి, ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని భరోసా కల్పించారు.

**స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల తనిఖీ**

ధర్మవరం పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ తనిఖీ చేశారు. ఎన్నికల సామగ్రి భద్రత, కేంద్రాల వద్ద రక్షణ చర్యలు, అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించారు. నిరంతర పర్యవేక్షణతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభం**

ఎన్నికల భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు ధర్మవరం డీఎస్పీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి,వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించి నిరంతర నిఘా కొనసాగిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే గుర్తించి, సత్వర చర్యలు తీసుకునేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని వివరించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం, ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకోవడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు, చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు,గతంలో గొడవలకు పాల్పడిన వ్యక్తులు,అల్లర్లకు అవకాశం ఉన్నవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు, బెదిరింపులకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని,రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఇదిలా ఉండగా,అడిషనల్ ఎస్పీ కె.వి. మహేష్ పట్టణంలోని లోన్‌కోటలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బి.వి. జగన్నాథ్ రాజు, శ్రీనివాసులు,సీఐలు రెడ్డప్ప,జయనాయక్, లింగన్న,ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీటీసీ అభ్యర్థులకు బి ఫారాలు అందజేసిన నాయకులు.

**చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్ 27:** స్థానిక ఎన్నికల్లో ఎంపిటిసి అభ్యర్థులుగా పోటీ చేసే అభ్యర్థులకు కూటమి నాయకులు బి ఫారాలు అందజేశారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు గజపతినగరం ఎంపీటీసీ అభ్యర్థి విల్లూరి మాధవి అన్నపూర్ణ (కనిశెట్టి శ్యామ్ కుమార్ ) షుగర్ ఫ్యాక్టరీ విశ్రాంతి ఉద్యోగి కనిశెట్టి ఈశ్వరరావు కు బీఫారం అందజేయగా, చోడవరం ఎంపీటీసీ 1 సిగ్మెంట్ అభ్యర్థి గూనూరు ఎర్ర అప్పల నాయుడు కు ఎంపీపీ అభ్యర్థి, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు, యూత్ నాయకులు సకురు కోటేశ్వరరావు, గర్ల్స్ హైస్కూల్ చైర్మన్ గుమ్మాల సత్తిబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ యర్రంశెట్టి చిన్న, గూనూరు వెంకట్రావు బి ఫారం అందజేశారు. అలాగే జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి పి.వి.ఎస్.ఎన్ రాజు, చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్, జనసేన ప్రధాన కార్యదర్శి అల్లం రామ అప్పారావు అంబేరుపురం ఎంపీటీసీ అభ్యర్థి దాడి వెంకట అప్పారావు కు, చోడవరం ఎంపీటీసీ 2 సిగ్మెంట్ అభ్యర్థి సత్యవరపు శ్రీనివాస్ రావుకు బి ఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సాయిరాం గ్రాండ్ శ్రీనివాసరావు, శివాలయం మాజీ చైర్మన్ పసుమర్తి మల్లిక్, విఘ్నేశ్వర ఆలయం మాజీ చైర్మన్ పసుమర్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



# చోడవరంలో 25 ఎంపిటిసి సెగ్మెంట్లకు పోటీలో 57 మంది




**చోడవరం, అక్టోబర్27, పెన్ సత్తా:** మండలంలోని 25 ఎంపిటిసి సెగ్మెంట్లకు గాను 57 మంది పోటీలో ఉన్నారు. ఈ సారి పోటీ చేసే అభ్యర్థులు ఎక్కువగా ఉండటంతో అన్ని ప్రధాన పార్టీల్లో కూడా బి ఫారాలు ఇవ్వలేదనే అసంతృప్తి నెలకొంది. అధికార పార్టీ అయిన టిడిపి, జనసేన, బిజెపి నుండి పోటీ ఎక్కువగా ఉండడమే కాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా పోటీ గట్టిగా ఉంది. ఆశావహులు నాయకులు చుట్టూ తిరిగి బి ఫారం రాలేదని అసంతృప్తితో ఉన్నారు. అన్ని ప్రధాన పార్టీల్లో కూడా ఈ పరిస్తితి నెలకొంది.

# దాడి నాగ అప్పారావుకు బి ఫారం అంజేసిన ఎమ్మెల్యే

**చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్ 27:** మండలం లోని గాంధీగ్రామం ఎంపీటీసీ అభ్యర్థి దాడి పద్మ (దాడి నాగ అప్పారావు) కు బిఫారం అందజేశారు. దీంతో ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.




# జడ్పిటిసి అభ్యర్థి డివిఆర్ కు బి ఫారం అందజేసిన గుడివాడ అమర్నాథ్



**చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్ 27:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చోడవరం జడ్పిటిసి అభ్యర్థిగా వైసీపీ సీనియర్ నాయకులు, నరసాపురం గ్రామాలకు చెందిన డివిఆర్ దొడ్డి వెంకటరావును ఎంపిక చేసి మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి గుడివాడ అమర్నాథ్ బి ఫారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అభ్యర్థి పల్లా నర్సింగరావు, మండల పార్టీ అధ్యక్షులు శరగడం సిమ్మునాయుడు, వైసిపి యూత్ నాయకులు గూనూరు రామచంద్రనాయుడు, మాజీ ఉపసర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి గోవింద, పలువురు ఎంపీటీసీ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# 21వ వార్డులో టీడీపీ అభ్యర్థి కత్తుల సునీత ఇంటింటి ప్రచారం

గాంధీనగర్‌లో ప్రజలతో ఆత్మీయ పలకరింపులు



**ధర్మవరం అక్టోబర్ 27 (పెన్ సత్తా)** ధర్మవరం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 21వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి కత్తుల సునీత గాంధీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు వార్డులోని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ,తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని,టీడీపీ చైర్మన్ అభ్యర్థి పరిసే సుధాకర్‌కు మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థించారు. వార్డులోని ప్రజలను నేరుగా కలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్ చౌదరి,బండి వెంకటేష్,ఓబుళపతి, వార్డు ఇన్‌చార్జి కత్తుల బాబ్జి,పార్టీ కార్యకర్తలు,సెక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో ఎన్డీఏ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా హరీష్ బాబు విస్తృత ప్రచారం

సైకిల్,కమలం గుర్తులకు ఓటేయండి..ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి



**ధర్మవరం,అక్టోబరు 27 (పెన్ సత్తా)** ధర్మవరం మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను కలుసుకున్నారు.

ధర్మవరం మున్సిపల్ చైర్మన్ పదవికి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న పరిశే సుధాకర్‌తో పాటు వివిధ వార్డుల్లో బరిలో ఉన్న ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రజల మద్దతు కూడగట్టారు. ఇందులో భాగంగా 9వ వార్డు బీజేపీ అభ్యర్థి తులసి దాస్,10వ వార్డు టీడీపీ అభ్యర్థి గుద్దేటి శివప్రసాద్, 16వ వార్డు బీజేపీ అభ్యర్థి కృష్ణాపురం రజియా బేగం,6వ వార్డు బీజేపీ అభ్యర్థి వడిత్య సోమ్లా నాయక్,43వ వార్డు బీజేపీ అభ్యర్థి శంకరప్పస్వామితో కలిసి ఆయా వార్డుల్లో ప్రచారం చేపట్టారు.

ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డులోనూ ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు కూడగట్టాలని సూచించారు. పట్టణ అభివృద్ధి కోసం ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పరిశే సుధాకర్‌తో పాటు టీడీపీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై,బీజేపీ అభ్యర్థులకు కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని హరీష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థుల విజయానికి కృషి చేశారు.

# ఎట్టకేలకు చోడవరం జడ్పిటిసి టికెట్ కైవసం చేస్తున్న కనిశెట్టి మత్స్యరాజు

తిరిగి తిరిగి వరించిన జడ్పిటిసి టికెట్



**చోడవరం, పెన్ సత్తా, అక్టోబర్ 27:** స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎక్కువ కావడంతో చోడవరంలో రాజకీయ పరిణామాలు అప్పటికి అప్పుడే మారిపోతున్నాయి. జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేయడానికి టిడిపి నుండి మాజీ జెడ్పిటిసి, మండల టిడిపి అధ్యక్షులు కనిశెట్టి సన్యాసిరావు (మత్స్యరాజు ), గంధవరం మాజీ సర్పంచ్ పల్లా అర్జున్, బిజెపి నుండి రాష్ట్ర నాయకులు ఈర్లే శ్రీరామమూర్తి, జనసేన నుండి జెర్రిపోతుల నానాజీ తదితరులు ఆశించారు. అధికార పార్టీ కావడంతో ఎవరిని ఆ టిక్కెట్ వరిస్తుందో.... పార్టీ నేతలు ఎవరికి బి ఫారం ఇస్తారో మంగళవారం మధ్యాహ్నం వరకు టెన్షన్ టెన్షన్ గా ఉండేది. ఒక దశలో కనిశెట్టి మత్స్యరాజు పేరు, మరొక దశలో పల్లా అర్జున్ పేరు, అలాగే ఈర్లె శ్రీరామమూర్తి పేరు, జెర్రిపోతుల నానాజీ పేరులు వినిపించేవి. చివరికి మాజీ జెడ్పీటీసీ కనిశెట్టి సన్యాసిరావు ( మత్స్యరాజు ) పేరును ఖరారు చేశారని తెలిసింది. పార్టీ అధినేతలు నుండి ఆదేశాలు రావడంతో మత్స్యరాజును జడ్పిటిసి టికెట్ వరించింది. సోమవారం అర్ధరాత్రి నుండి రాజకీయ సమీకరణాలు మారాయి. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

## సంపాదకీయం

# కంచె దాటిన ముప్పు!

దేశ భద్రత అంటే చాలామందికి సరిహద్దుల్లో సైనికులు, ఎత్తైన గోడలు, ముళ్ల కంచెలు గుర్తొస్తాయి. కానీ డిజిటల్ యుగంలో ముప్పు ముందు గుమ్మం నుంచే రాదన్న విషయం, కూడంకుళం అణు విద్యుత్కేంద్రం తాజా డేటా లీకుతో మరోసారి రుజువైంది. ఈ ఏడాది జూలై 15న వెలుగులోకి వచ్చిన కథనం ప్రకారం, 'వరల్డ్ లీక్స్' అనే రాన్సమ్‌వేర్ ముఠా తన డార్క్ వెబ్ పోర్టల్‌లో కూడంకుళం ప్రాజెక్టుకు చెందినవిగా చెబుతున్న దాదాపు 19 వేల ఫైళ్లను, అంటే సుమారు 14.3 జీబీ సమాచారాన్ని బహిర్గతం చేసింది. 2016 నుంచి 2025 వరకు ఉన్న ఈ పత్రాల్లో ఇంజినీరింగ్ డ్రాయింగులు, వెంటిలేషన్, కూలింగ్ వ్యవస్థల బ్లూప్రింట్లు, కంట్రోల్ రూమ్ లేఅవుట్లు, సరఫరాదారుల వివరాలు, తనిఖీ నివేదికలు, బీమా పత్రాలు ఉన్నట్టు సమాచారం. కూడంకుళం 3, 4 యూనిట్ల సాధారణ మౌలిక సదుపాయాల నిర్మాణ కాంట్రాక్టు దక్కించుకున్న అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈ లీకును 'పాక్షిక ఉల్లంఘన'గా అంగీకరించింది. ఆ సమాచారాన్ని థర్డ్ పార్టీ డేటా సెంటర్ 'యోట్టా' సర్వర్‌లో భద్రపరిచామని, ప్రభుత్వానికి తెలియజేశామని చెప్పింది. మే 29నే తమ సర్వర్‌పై అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి, దాడిని అడ్డుకున్నామని యోట్టా ప్రకటించింది. కానీ జూన్ 11 నుంచే ఈ ఫైళ్లు డార్క్ వెబ్‌లో అందుబాటులో ఉన్నాయని స్వతంత్ర సైబర్ పరిశోధకుడు రాకేశ్ కృష్ణన్ వెల్లడించడం గమనార్హం. అంటే 'అడ్డుకున్నాం' అన్న మాటకు, జరిగిన వాస్తవానికి మధ్య పెద్ద అగాధమే ఉంది. మరోవైపు, బయటకు వచ్చిన సమాచారం అణు భద్రతతో సంబంధం లేని సాధారణ సదుపాయాలకే పరిమితమని, రియాక్టర్ల భద్రతా వ్యవస్థలతో దానికి ఎలాంటి సంబంధమూ లేదని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్) స్పష్టం చేసినా.. దేశంలోని అత్యంత సున్నితమైన కేంద్రాలకు సంబంధించిన కీలక సమాచారం, ఆ కేంద్రాల గోడల బయట కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్ల దగ్గర ఎంత మేరకు పోగుపడి ఉంది, దాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎవరిది అన్నదే చర్చించాల్సిన అంశం. ఈ తరహా ముప్పు కూడంకుళంకు కొత్తేమీ కాదు. 2019లో కూడా ఓ మాల్వేర్ దీని పరిపాలనా నెట్‌వర్క్‌లో బయటపడగా, కీలక అంతర్గత వ్యవస్థకు మాత్రం ఎలాంటి ముప్పూ లేదని అప్పుడూ ఎన్‌పీసీఐఎల్ నొక్కి చెప్పింది. అప్పుడు పరిపాలనా నెట్‌వర్క్ అయితే, ఇప్పుడు వాణిజ్య డేటా సెంటర్‌లోని కాంట్రాక్టర్ సర్వర్.. రెండుసార్లూ కేంద్రం గుండెభాగం సురక్షితంగానే ఉన్నా, ముప్పు మాత్రం అంచుల్లోనే ఉంది.

ఆధునిక అణు విద్యుత్కేంద్రం గానీ, విద్యుత్ గ్రిడ్‌గానీ, రక్షణ ఉత్పత్తి కేంద్రం గానీ ఏ ఒక్క సంస్థ ఒంటరిగా నిర్మించి నడపగలిగేది కాదు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు ఇంజినీరింగ్ కంపెనీలు, పరికరాలు, సాఫ్ట్‌వేర్ సరఫరాదారులు, క్లౌడ్, డేటా సెంటర్ సంస్థలు, బీమా కంపెనీలు, అంచెలంచెలుగా సబ్ కాంట్రాక్టర్లు... ఇలా ఎంతోమంది ఇందులో భాగస్వాములు. కూడంకుళం విషయంలోనైతే రియాక్టర్లను సరఫరా చేస్తున్నది రష్యా ప్రభుత్వ సంస్థ రోసాటమ్. వీరందరి దగ్గరా డ్రాయింగులు, కొనుగోలు ఆర్డర్లు, లాగిన్ వివరాలు వంటి సున్నితమైన సమాచారం చట్టబద్ధంగానే ఉంటుంది. కానీ ప్రధాన కేంద్రంలో ఉండే రక్షణ వలయాలు ఆ సమాచారానికీ ఉండాలన్న నియమమేమీ లేదు. ఆరితేరిన దాడిదారులు ఇలాంటి సమాచారంతో కాంట్రాక్టర్లను గుర్తిస్తారు, ఫిషింగ్ దాడులకు లక్ష్యాలను ఎంచుకుంటారు, ఏ సబ్ కాంట్రాక్టర్ ద్వారా సులువుగా లోపలికి చొరబడవచ్చో అంచనా వేస్తారు. రియాక్టర్లను నేరుగా నియంత్రించలేకపోయినా, ఈ ఫైళ్లు ప్లాంట్ సహాయక వ్యవస్థలు, సరఫరా గొలుసులోని లోపాలపై శత్రువులకు విలువైన నిఘా సమాచారం అందించగలవని న్యూక్లియర్ థ్రెట్ ఇనిషియేటివ్‌కు చెందిన నికోలస్ రాత్ హెచ్చరించడం గమనార్హం. సైబర్ ఘటనలపై స్పందించే జాతీయ సంస్థగా సీఈఆర్‌టీ-ఇన్ ఉంది, ఘటనలను ఆరు గంటల్లోగా నివేదించడం తప్పనిసరి చేసే ఆదేశాలూ ఉన్నాయి. అయితే ఈ నిబంధనలన్నీ 'రక్షిత వ్యవస్థ'ను కలిగి ఉన్న ఆపరేటర్ చుట్టూనే తిరుగుతాయి. ప్రాజెక్టు సమాచారం కాంట్రాక్టర్‌కు, అక్కడి నుంచి సబ్ కాంట్రాక్టర్‌కు లేదా డేటా సెంటర్‌కు చేరగానే, దాని రక్షణ కేవలం ఒప్పందాల్లోని షరతుల మీదే ఆధారపడుతోంది. డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టం వ్యక్తిగత సమాచారానికే వర్తిస్తుంది కాబట్టి ఇంజినీరింగ్ డ్రాయింగుల వంటి సాంకేతిక పత్రాలు దాని పరిధిలోకి రావు. ఫలితంగా జవాబుదారీతనం గాల్లో వేలాడుతోంది. ఇక్కడ ఎవరి వాదనలు ఎలావున్నా.. దేశానికి సంబంధించిన కీలక పత్రాలు మాత్రం డార్క్ వెబ్‌లో దర్శనమిస్తాయన్నదే విషయం.

కూడంకుళంలో ప్రస్తుతం వెయ్యి మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లు పనిచేస్తుండగా, 3, 4, 5, 6 యూనిట్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. అన్నీ పూర్తయితే ఈ కేంద్రం సామర్థ్యం 6,000 మెగావాట్లకు చేరుతుంది. మరోవైపు, 2047 నాటికి వంద గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యం సాధించాలన్న లక్ష్యంతో కేంద్రం ఇటీవలే 'శాంతి' చట్టాన్ని తెచ్చి, దశాబ్దాలుగా ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉన్న అణు రంగంలోకి ప్రైవేటు సంస్థలకు తలుపులు తెరిచింది. దీనికి తోడు స్మార్ట్ గ్రిడ్‌లు, రక్షణ-అంతరిక్ష రంగాల్లో ప్రైవేటు భాగస్వామ్యం, ప్రభుత్వ డేటా వాణిజ్య క్లౌడ్‌లకు తరలడం వంటివి వేగంగా జరుగుతున్నాయి. వ్యూహాత్మకంగా ఇవన్నీ సరైన అడుగులే అయినా, వీటివల్ల సున్నితమైన సమాచారం మరిన్ని ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్తుంది, దాడిదారులకు చొరబడే దారులూ అంతేస్థాయిలో పెరుగుతాయి. అన్నీ ప్రభుత్వమే నిర్మించి నియంత్రించే రోజుల కోసం రూపొందించిన సైబర్ భద్రతా విధానం, నేటి ప్రైవేటు-ఆధారిత వ్యవస్థకు సరిపోదు. అందుకే కొన్ని సంస్కరణలు తక్షణం అవసరం. భద్రతా బాధ్యతలు సంస్థను కాకుండా సమాచారాన్ని అనుసరించాలి, ప్రతి కాంట్రాక్టర్‌నూ నిర్దిష్ట ప్రమాణాలకు, ఆడిట్ నిబంధనలకు టెండర్ ఒప్పందాల్లోనే కట్టుబడేలా చేయాలి; సమాచార వర్గీకరణ పక్కాగా జరిగి, అవసరమైన సమాచారం మాత్రమే, అవసరమైనంత కాలమే కాంట్రాక్టర్ల దగ్గర ఉండాలి; కాగితపు సర్టిఫికెట్లకు బదులు స్వతంత్ర రిస్క్ అంచనాలు, దాడి పరీక్షలు జరగాలి; ఏ నెట్‌వర్క్‌నూ గుడ్డిగా నమ్మని 'జీరో ట్రస్ట్' విధానం అమలవ్వాలి; చివరిగా సీఈఆర్‌టీ-ఇన్, ఎన్‌సీఐఐపీసీ, రంగాలవారీ నియంత్రణ సంస్థలు అందరూ కలిసి సరఫరా గొలుసు భద్రతకు ఒకే జాతీయ చట్రాన్ని రూపొందించాలి. ఈ రహస్యాల విలువకు తగిన భద్రతా ప్రమాణాలు పాటించేలా చూసినప్పుడే దేశానికి నిజమైన రక్షణ!

---

### పనికొచ్చే పలుకు



# జీవితం మారాలంటే.. వాటికి గుడ్‌బై తప్పదు!

జీవితంలో ఎదగాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. మంచి కెరీర్, ఆర్థిక స్వేచ్ఛ, ప్రశాంతమైన మనసు, నచ్చిన జీవనశైలి.. ఇవన్నీ కోరుకుంటాం. కానీ కోరుకున్న జీవితానికి, జీవిస్తున్న జీవితానికి మధ్య అడ్డుగా నిలుస్తున్నది ఎవరో కాదు.. మనలోని చెడు అలవాట్లే! భవిష్యత్తును నిర్మించే శక్తి, నాశనం చేసే అలవాట్లూ రెండూ ఒకచోటే ఉంటాయి.

**సాకులు చెప్పడం మానేయండి:** ఏదైనా సాధించాలంటే సమయం లేదని, పరిస్థితులు అనుకూలంగా లేవని, సరైన అవకాశాలు రావడం లేదని చెప్పే సాకులు సమస్యను పరిష్కరించవు. పరిస్థితులన్నీ అనుకూలించిన తర్వాతే ప్రయాణం మొదలెడతానంటే, ఆ రోజు ఎప్పటికీ రాకపోవచ్చు. పరిపూర్ణమైన ఆరంభం కోసం ఎదురుచూడకండి. మీ దగ్గర ఉన్న వనరులతోనే మొదటి అడుగు వేయండి. చిన్న పురోగతైనా సరే.. అది సాకుల వెనుక దాక్కోవడం కంటే ఎంతో విలువైనది.

**పరధ్యానానికి కళ్లెం:** ఫోన్‌లో ఒక నోటిఫికేషన్.. దాని వెనుక మరో రీల్.. అలా నిమిషాల నుంచి గంటల సమయాన్ని మింగేస్తుంది స్క్రీన్. చివరకు రోజంతా బిజీ అన్న భావన తప్ప, సాధించిన పని కనిపించదు. గుర్తుంచుకోండి.. బిజీ వేరు, ఉత్పాదకత వేరు. రోజులో కొంత సమయాన్ని ఫోన్‌కు దూరంగా ఉంచి, ఒక పనిపై పూర్తి దృష్టి పెట్టండి. మీ దృష్టి ఎక్కడ ఉంటుందో, మీ శక్తి అక్కడే ఖర్చవుతుంది. ఆ శక్తి మీ లక్ష్యాలకు ఉపయోగపడుతోందా లేదా అన్నదే అసలు ప్రశ్న.

**శక్తిని హరించే వ్యక్తులకు హద్దులు:** అంతా మన ఎదుగుదలకు తోడ్పడరు. కొందరు విమర్శిస్తారు.. ఇంకొందరు మీ కలలను చిన్నచూపు చూస్తారు. ఇంకొందరు ప్రతికూల ఆలోచనలతో ఉత్సాహాన్ని తగ్గిస్తారు. వాళ్లను సంతోషపెట్టడం మన బాధ్యత కాదు. అయితే, ప్రతి భిన్నాభిప్రాయం ప్రతికూలత కాదు. నిజాయితీగా తప్పులను ఎత్తిచూపేవారిని గౌరవించండి. ఎదుగుదలను అడ్డుకునే సంబంధాలకు మాత్రం ఆరోగ్యకరమైన హద్దులు పెట్టండి. మీరు మెరుగైన వ్యక్తిగా మారాలనిపించే వారితో ఎక్కువ సమయం గడపండి.

**మీవి కాని లక్ష్యాల కోసం పరుగులొద్దు:** ఇతరుల జీవితంలోని హైలైట్స్‌తో మన జీవితాన్ని పోల్చుకోవడం మూర్ఖత్వం. మీకు నిజంగా ఏంకావాలో తెలుసుకోకుండా, సమాజం మెచ్చుకునే విజయాల కోసం పరుగెత్తితే గమ్యాన్ని చేరినా సంతృప్తి దొరకకపోవచ్చు. మీ విలువలు, ఆసక్తులు, పరిస్థితులకు సరిపోయే లక్ష్యాలను ఎంచుకోండి.

**తక్షణ ఆనందానికి భవిష్యత్తును తాకట్టు పెట్టొద్దు:** తాత్కాలిక ఆనందాల కోసం దీర్ఘకాలిక లక్ష్యాలను తాకట్టుపెట్టొద్దు. రోజూ.. కాస్త క్రమశిక్షణతో చదవడం, నైపుణ్యాన్ని పెంచుకోవడం, డబ్బు పొదుపు చేయడం, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం.. మొదట్లో కష్టంగా అనిపించవచ్చు. కానీ రేపటి మీకు ఇవే స్వేచ్ఛను, అవకాశాలను అందిస్తాయి. ఆనందాన్ని వదులుకోవాల్సిన అవసరం లేదు.. దాన్ని ఆస్వాదించే విషయంలో సమతుల్యత నేర్చుకోవాలి.

**మంచి మాట:** మీ జీవితాన్ని మార్చుకోవడానికి ఎప్పుడూ పెద్ద నిర్ణయాలే అవసరం లేదు. కొన్నిసార్లు ఒక సాకు చెప్పకుండా పని మొదలుపెట్టడం, ఫోన్‌ను పక్కనపెట్టి లక్ష్యంపై దృష్టి పెట్టడం, అవసరం లేని ఖర్చును ఆపడం.. ఇలాంటి చిన్న నిర్ణయాలే పెద్ద మార్పులకు పునాది వేస్తాయి. మీ అలవాట్లు మీ భవిష్యత్తుకు ఓటు వేస్తున్నట్లే. ప్రతిరోజూ మీరు తీసుకునే నిర్ణయాలు మీకు కావాల్సిన జీవితానికి దగ్గర చేస్తున్నాయా, దూరం చేస్తున్నాయా అని ప్రశ్నించుకోండి. జీవితంలో అందరినీ మార్చలేరు.. అన్ని పరిస్థితులనూ నియంత్రించలేరు. కానీ మీ అలవాట్లను, మీ ప్రతిస్పందనలను, మీ ప్రాధాన్యాలను మార్చుకోవచ్చు. మీ జీవితానికి నిజమైన అప్‌గ్రేడ్ అక్కడి నుంచే మొదలవుతుంది!

---

# ఏఐ యుగంలో విద్యాలక్ష్యం మారాలి!

చదువు అంటే పుస్తకాల్లోని అంశాలను కంఠస్థం చేసి పరీక్షల్లో రాయడం కాదని, గమనించడం, ప్రశ్నించడం, స్వయంగా తెలుసుకోవడమే నిజమైన మేధస్సు అని తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి చెప్పేవారు. సమాచారాన్ని సేకరించి అందించే పనిని కృత్రిమ మేధ (ఏఐ) క్షణాల్లో చేసిపెడుతున్న నేటి కాలంలో ఈ మాటలు మరింత ప్రాసంగికతను సంతరించుకుంటున్నాయి. నేర్చుకునే సామర్థ్యం, స్వతంత్రంగా ఆలోచించే నైపుణ్యం కలిగినవారినే నేడు కంపెనీలు కోరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల పాత్ర కేవలం సమాచారం అందించడం నుంచి, విద్యార్థుల్లో జిజ్ఞాసను, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించే దిశగా మారాల్సిన అవసరం ఏర్పడింది. మంచి ప్రశ్నలు అడగడమే ఏఐ యుగంలో మనిషిని ప్రత్యేకంగా నిలబెట్టే లక్షణం.



ఒకప్పుడు చదువంటే పాఠ్యపుస్తకాల్లోని అంశాలను కంఠస్థం చేసి, పరీక్షల్లో రాసి మంచి మార్కులు తెచ్చుకోవడమే అనే అవగాహన బలంగా ఉండేది. కానీ ఈ దృక్పథం మొదటి నుంచీ లోపభూయిష్టమేనని ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి స్పష్టం చేశారు. నిజమైన మేధస్సు అంటే కేవలం సమాచారాన్ని కూడబెట్టుకోవడం కాదని, గమనించడం, ప్రశ్నించడం, స్వయంగా ఆలోచించి తెలుసుకోవడమేనన్నది ఆయన వాదన. కృత్రిమ మేధ (ఏఐ) వేగంగా విస్తరిస్తున్న నేటి తరుణంలో ఈ మాటలకు మరింత విలువ చేకూరుతోంది. సమాచారాన్ని సేకరించి అందించే పనిని ఏఐ క్షణాల్లో చేసిపెడుతున్న నేపథ్యంలో, మనిషికి ప్రత్యేకంగా నిలబెట్టే లక్షణం ఆలోచించగల సామర్థ్యమే తప్ప, తాను ఎంత సమాచారం గుర్తుంచుకున్నాడు అన్నది కాదు. దీంతో ఉద్యోగ మార్కెట్‌లో సైతం పరిస్థితులు మారుతున్నాయి. సమాచారాన్ని మననం చేసుకునే నైపుణ్యానికి బదులు, కొత్త పరిస్థితులను విశ్లేషించి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యానికి ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ మార్పు విద్యా వ్యవస్థపై, ముఖ్యంగా ఉపాధ్యాయుల పాత్రపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇకపై ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పే, సమాచారాన్ని అందించే వ్యక్తులుగా మిగిలిపోతే సరిపోదు. విద్యార్థుల్లో జిజ్ఞాసను, ప్రశ్నించే తత్వాన్ని, స్వీయ అన్వేషణ నైపుణ్యాన్ని పెంపొందించే మార్గదర్శులుగా మారాల్సిన అవసరం ఏర్పడింది. నేర్చుకునే సామర్థ్యం కలిగినవారినే నేడు కంపెనీలు ఉద్యోగులుగా కోరుకుంటున్నాయి. గూగుల్ మాజీ సీఈవో ఎరిక్ స్మిత్ అన్నట్టు, 'నేర్చుకునే సామర్థ్యమే అసలైన నైపుణ్యం' అనే మాట నేటి ఉద్యోగ మార్కెట్‌కు అద్దం పడుతోంది. కాబట్టి బోధన లక్ష్యం కేవలం ప్రాథమిక అంశాలను, సాంకేతిక నైపుణ్యాలను నేర్పడానికే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో జీవితాంతం నేర్చుకునే స్వభావాన్ని పాదుకొల్పడం వైపు మళ్లాలి. అందుకు సవాళ్లతో కూడిన సమస్యలను విద్యార్థులకు అప్పగించి, వాటిని పరిష్కరించే క్రమంలో ఎదురయ్యే అడ్డంకులను కలిసి అధిగమించే పద్ధతి మేలు చేస్తుంది.

ఈ మార్పును ఆచరణలో పెట్టడానికి ఉపాధ్యాయులు మొదట తమ విద్యార్థులను లోతుగా అర్థం చేసుకోవాలి. ఇందుకు సహానుభూతి, స్వీయ అవగాహన రెండూ అవసరం. ఒక విషయాన్ని ఇతరులకు అర్థమయ్యేలా వివరించే బాధ్యత ఉన్నప్పుడు, మనల్ని మనం ఎప్పటికప్పుడు ప్రశ్నించుకుని విషయాలను లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. ఈ నిరంతర ప్రక్రియే నిజమైన క్రమశిక్షణగా మారుతుంది. ఈ సందర్భంగా 'నిర్మాణాత్మక సంభాషణ' అనే పద్ధతి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుంది. తరగతి గదిలో ఏకపక్ష ఉపన్యాసం ఇవ్వడం కంటే, ఆసక్తికరమైన ప్రశ్నతో చర్చను ప్రారంభించి విద్యార్థులను ఆలోచింపజేయడం మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇక్కడ గురు-శిష్య అనే అంతరాలు పక్కనపెట్టి, అందరూ కలిసి సత్యాన్వేషణ చేసే వాతావరణం ఏర్పడాలి. ఉదాహరణకు, మార్కెటింగ్ తరగతిలో 'ఒక పెద్ద కంపెనీకి అతిపెద్ద కస్టమర్ ఎవరు?' అన్న ప్రశ్న వేస్తే, సాధారణంగా విద్యార్థులు ఏదోక వినియోగదారుని పేరు చెబుతారు. కానీ వాస్తవానికి అది మరో పెద్ద వ్యాపార సంస్థే కావచ్చు అన్న విషయం చర్చ ద్వారా బయటపడుతుంది. ఇలాంటి ప్రశ్నలు పైకి కనిపించే జవాబుకు మించి లోతైన అవగాహనను కలిగిస్తాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నిజాయతీగా ఈ తరహా అన్వేషణ సాగించినప్పుడే నేర్చుకోవడం సంపూర్ణమవుతుందని కృష్ణమూర్తి భావించేవారు. అంటే, విద్య అనేది ఒక దిశలో జరిగే సమాచార బదిలీ కాదు, ఉపాధ్యాయుడు-విద్యార్థి ఇద్దరూ కలిసి సాగించే ఉమ్మడి అన్వేషణ ప్రక్రియ. చదువు లక్ష్యం కేవలం మంచి మార్కులు తెచ్చుకోవడం, ఉద్యోగానికి పనికొచ్చే నైపుణ్యాలు నేర్చుకోవడం మాత్రమే కాదు. మంచి ప్రశ్నలు అడిగే, లోతుగా ఆలోచించే, జిజ్ఞాస కలిగిన పరిపూర్ణ వ్యక్తులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే అసలు లక్ష్యం కావాలి. ఇప్పటికే అమలులో ఉన్న వ్యవస్థకు తగ్గట్టుగా మనుషులను మలచడమే విద్య లక్ష్యమైతే, అది విఫలమవుతుందని కృష్ణమూర్తి హెచ్చరించారు. చదువు అంతిమ లక్ష్యం మనిషిని సంపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దడమేనని ఆయన స్పష్టం చేశారు.

ఏఐ శకంలో ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. మంచి ప్రశ్నలు అడగగలగడమే విద్యార్థులను ప్రత్యేకంగా నిలబెట్టే లక్షణం కానుంది, ఎందుకంటే సమాధానాలు వెతికే పనిని ఏఐ ఇప్పటికే సమర్థంగా చేస్తోంది. కాబట్టి విద్యార్థులను కేవలం ఉద్యోగాల కోసం కాకుండా, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దడం ముఖ్యం. దీనివల్ల వారిలో సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం, పట్టుదల, సమస్యా పరిష్కార సామర్థ్యం పెరుగుతాయి. ఉద్యోగ నైపుణ్యాలతో పాటు నిత్యం మారుతున్న సాంకేతికతలను అందిపుచ్చుకునేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అవసరం. ఇందుకు ఏఐ సాధనాలను సైతం సృజనాత్మకంగా వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు, పాఠ్యాంశాలకు సంబంధించిన కార్టూన్లు, చర్చనీయ ప్రశ్నలు రూపొందించి తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యాన్నీ, జ్ఞాపకశక్తినీ పెంచవచ్చు. ఇలాంటి సృజనాత్మక సాధనాలు పాఠ్యాంశాలను విద్యార్థుల నిజ జీవితానికి దగ్గరగా తీసుకెళ్లి, వారిని విమర్శనాత్మకంగా ఆలోచించేలా ప్రోత్సహిస్తాయి. తరగతి గదిలో స్నేహపూర్వక, సుహృద్భావ వాతావరణం ఉన్నప్పుడే విద్యార్థులు స్వేచ్ఛగా ప్రశ్నించగలుగుతారు, చురుగ్గా నేర్చుకోగలుగుతారు. కాబట్టి ఏఐ యుగంలో ఉపాధ్యాయుల పాత్ర సమాచారాన్ని అందించడం నుంచి ఆలోచనా ప్రక్రియను పెంపొందించే దిశగా మళ్లాలి. విద్యార్థులను మంచి ప్రశ్నలు అడిగేలా, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేలా, జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవరచుకునేలా తీర్చిదిద్దడమే నేటి విద్యా వ్యవస్థ ప్రధాన లక్ష్యం కావాలి. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, ఆలోచించే శక్తి, ప్రశ్నించే తత్వమే మనిషిని ■

---



ఆర్థికంగా ఎదగాలంటే ముందుగా బడ్జెట్ వేసుకుని, అనవసర ఖర్చులను తగ్గించి, సంపాదనలో కనీసం 20 శాతం పొదుపు లేదా పెట్టుబడిగా మళ్లించాలి. అప్పులన్నీ తీర్చి, ఆదాయ మార్గాలను పెంచుకుంటూ, భవిష్యత్తులో విలువ పెరిగే ఆస్తులను కొనుగోలు చేయాలి. మన ఎదుగుదలకు తోడ్పడే జీవిత భాగస్వామిని ఎంచుకోవడంతోపాటు, వ్యాపార దృక్పథం ఉన్నవారితో స్నేహం చేయాలి. ఆడంబరాలకు దూరంగా ఉంటూ, మన జ్ఞానం, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై పెట్టుబడి పెట్టాలి. గుర్తుంచుకోండి.. సంపాదించడం ఆర్థిక విజయానికి ఆరంభం మాత్రమే; దాన్ని సరిగ్గా నిర్వహించడం, పెంచుకోవడం, భవిష్యత్తుకు భద్రపరచుకోవడమే నిజమైన సంపదకు పునాది.

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

# పుస్తకం తెరిస్తే.. ఏకంగా భవనం బయటకు!



పుస్తకం తెరిస్తే బొమ్మలు పైకి లేవడం చూశాం.. కానీ పుస్తకం తెరిస్తే ఏకంగా భవనమో, మహావృక్షమో బయటకు వస్తే! అమెరికాలోని లాస్ ఏంజెలెస్ పబ్లిక్ లైబ్రరీలో ఈ వింత పుస్తకం సందర్శకులను ఆశ్చర్యపరుస్తోంది. 'లూసెరోస్ వై పెనుంబ్రాస్' పేరిట రూపొందించిన ఈ పాప్-అప్ పుస్తకం తెరిస్తే 15.41 అడుగుల వెడల్పు, 20.01 అడుగుల పొడవుతో విస్తరిస్తుంది. బొమ్మలు 11 అడుగుల ఎత్తు వరకు పైకి లేస్తాయి. దీని పేజీ తిప్పాలంటే ఒక్కరు సరిపోరు.. ఏకంగా పదిమంది కావాలి! గిన్నిస్ ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్న ఈ పుస్తకం ముందు పిల్లలే కాదు.. పెద్దలూ బొమ్మల్లా నోరెళ్లబెట్టాల్సిందే!

# వెల్లింగ్టన్‌లో అభిషేక్ సునామీ.. రికార్డుల మోతతో సిరీస్ భారత్ కైవసం

**కివీస్‌పై మూడో టీ20లో టీమిండియా ఘన విజయం**

**యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 38 బంతుల్లోనే 113 పరుగులు**

**పవర్‌ప్లేలో 118 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించిన భారత్**

**ఈ విజయంతో 3–0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా**

**భారీ లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించిన భారత జట్టు**





న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. పరుగుల సునామీ సృష్టిస్తూ కేవలం 38 బంతుల్లోనే 9 ఫోర్లు, 11 సిక్సర్ల సహాయంతో 113 పరుగులు చేయగా, టీమిండియా మరపురాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3–0 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. కివీస్ నిర్దేశించిన 199 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు ఊది పారేశారు. అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఈ భారీ స్కోరు కూడా చిన్నబోయింది. ఈ పోరులో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. న్యూజిలాండ్ బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబర్చారు. డారిల్ మిచెల్ (52 బంతుల్లో 89 నాటౌట్), ఫిన్ అలెన్ (25 బంతుల్లో 40) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆతిథ్య నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 45) కివీస్ బౌలర్లను ఊచకోత కోశారు. వీరిద్దరూ పవర్‌ప్లేలోనే టీ20 క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. తొలి 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 118 పరుగులు జోడించారు. ఇది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అత్యధిక పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. ఈ క్రమంలో రొమేనియా (116/0) రికార్డును భారత్ బద్దలుకొట్టింది. కేవలం 2.2 ఓవర్లలోనే 50 పరుగులు, 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసి పలు రికార్డులను తమ ఖాతాలో వేసుకుంది. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం తర్వాత వైభవ్ ఔటైనా, అభిషేక్ తన జోరు కొనసాగించాడు. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం అభిషేక్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5), సంజూ శాంసన్ (18) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో తిలక్ వర్మ (1), నమన్ ధీర్ (4) లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో టీమిండియా కేవలం 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో సిరీస్‌ను భారత్ 3–0 చేజిక్కించుకోగా, మిగిలిన రెండు మ్యాచ్‌లు నామమాత్రం కానున్నాయి. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

**మా ప్లాన్ చాలా సింపుల్.. వైభవ్ తో ఓపెనింగ్ పై అభిషేక్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు**

న్యూజిలాండ్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగి, కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు సాధించి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన తర్వాత, యువ సంచలనం అభిషేక్ శర్మ తన విధ్వంసక ఇన్నింగ్స్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని పంచుకున్నాడు. తాను, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడటమే తమ ప్రణాళిక అని, ముఖ్యంగా పవర్‌ప్లేను సద్వినియోగం చేసుకోవాలని ముందే నిర్ణయించుకున్నామని తెలిపాడు. మ్యాచ్ అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న అభిషేక్ తన మనసులోని మాటలను వెల్లడించాడు. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా వెల్లింగ్‌టన్‌లోని హెన్రీ స్టేడియంలో జరిగిన మూడో టీ20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, అభిషేక్ శర్మ (38 బంతుల్లో 113; 9 ఫోర్లు, 11 సిక్సర్లు) సునామీ సెంచరీతో కేవలం 13.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3–0 తేడాతో కైవసం చేసుకుంది.

## స్పోర్ట్స్

### రంజీ ట్రోఫీ.. డబుల్ సెంచరీలతో మోతెక్కించిన బ్యాటర్లు



దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ 2026–27లో ఆయా జట్ల బ్యాటర్లు డబుల్ సెంచరీలు, శతకాలతో హోరెత్తిస్తున్నారు. ఎలైట్ గ్రూప్–ఏలో జార్ఖండ్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ బ్యాటర్ ఆయుశ్ బదోని డబుల్ సెంచరీతో చెలరేగగా, సుమిత్ మాథూర్ సెంచరీ సాధించాడు. తద్వారా ఢిల్లీ భారీ స్కోరు దిశగా సాగుతుంది. ప్రస్తుతం 126 ఓవర్లు ముగిసేసరికి ఢిల్లీ జట్టు 5 వికెట్ల నష్టానికి 474 పరుగులు చేసింది. బదోని (201), సుమిత్ మాథూర్ (118) క్రీజులో ఉన్నారు. ఈ ఇద్దరు ఆరో వికెట్‌కు అజేయంగా రికార్డు స్థాయిలో 293 పరుగులు జోడించడం విశేషం. ఎలైట్ గ్రూప్–డిలో హిమాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో చండీగఢ్ భారీ స్కోరు దిశగా సాగుతున్నది. 118 ఓవర్లు ముగిసేసరికి చండీగఢ్ 2 వికెట్ల నష్టానికి 528 పరుగులు చేసింది. ఓపెనర్ నిహాల్‌పజిని (324 బంతుల్లో 202 బ్యాటింగ్; 23 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ డబుల్ సెంచరీతో విధ్వంసం సృష్టించగా, అరస్లాన్ ఖాన్ (99) పరుగు తేడాతో సెంచరీ చేజార్చుకున్నాడు.

**ప్రియాన్షు డబుల్.. మహేశ్ సెంచరీ**

ఎలైట్ గ్రూప్–ఏలో భాగంగా జమ్మూ కశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో బరోడా బ్యాటర్ ప్రియాన్షు మోలియా ద్విశతకం మార్క్ సాధించాడు. 354 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించిన ప్రియాన్షు ఇన్నింగ్స్‌లో 22 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. ప్రస్తుతం బరోడా 128 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 430 పరుగులు చేసింది. మహేశ్ పితియా కూడా 210 బంతుల్లో శతకం మార్క్ అందుకున్నాడు. ఏడో వికెట్‌కు ఈ జోడి అజేయంగా 233 పరుగులు జోడించింది.

**పటీదార్ శతకం..**

ఇక ఎలైట్ గ్రూప్–ఏలో బీహార్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ కెప్టెన్ రజత్ పటీదార్ శతకం సాధించాడు. 133 బంతుల్లో 109 పరుగులు చేసిన పటీదార్ అనూహ్యంగా రనౌట్ అయ్యాడు. అంతకముందు వికెట్ కీపర్ సాక్షమ్ పురోహిత్ (132) కూడా సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఇక మధ్యప్రదేశ్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 407 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో బీహార్ 99 పరుగులకే కుప్పకూలడంతో, మధ్యప్రదేశ్ 308 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది.

**పంజాబ్ 431 ఆలౌట్**

ఎలైట్ గ్రూప్–బిలో హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో పంజాబ్ జట్టు 431 పరుగులకు ఆలౌటైంది. సలీల్ అరోరా (151) భారీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా, చివర్లో రమన్‌దీప్ సింగ్ (52) అర్ధసెంచరీ సాధించాడు. చివర్లో ఉమేశ్ యాదవ్ (37 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్లలో సీవీ మిలింద్ నాలుగు వికెట్లతో చెలరేగగా, రక్షణ్ మూడు వికెట్లు, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డిలు ఒక్కో వికెట్ పడగొట్టారు.

# కంటెంట్ పై నమ్మకం.. మరి రిస్కా? సవాలా?



ఎర్రని బ్రోకేడ్ పండుగ దుస్తుల్లో మెరిసిపోతున్న శ్రీముఖి





రూఫ్‌టాప్‌పై స్టైలిష్ డెనిమ్ లుక్‌లో ఆకట్టుకుంటున్న శివాంగి వర్మ

సినిమాపై నమ్మకం ఉండటం వేరు.. ఆ నమ్మకాన్ని బాక్సాఫీస్ దగ్గర ప్రూవ్ చేసుకోవడం వేరు. ముఖ్యంగా భారీ బడ్జెట్ తో తెరకెక్కిన సినిమాలకు విడుదల తేదీ కూడా రిజల్ట్ పై ఎఫెక్ట్ చూపిస్తుంది. ఇప్పుడు మెగా మేనల్లుడు సాయిదుర్గా తేజ్ నటిస్తున్న సంబరాల ఏటిగట్టు (ఎస్‌వైజీ) విషయంలో అదే పరిస్థితి కనిపిస్తోంది. కంటెంట్ పై మూవీ టీమ్ కు నమ్మకమున్నా.. ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది హాట్ టాపిక్ గా మారింది.

సాయిదుర్గా తేజ్ కెరీర్ లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం సంబరాల ఏటిగట్టు. దర్శకుడు రోహిత్ కేపీ ఆ సినిమాతో పరిచయం అవుతున్నారు. పీరియాడికల్ యాక్షన్ అడ్వెంచర్ గా రూపొందుతున్న ఆ చిత్రం కోసం తేజ్ రెండేళ్లకు పైగా సమయాన్ని కేటాయించారు. కొత్త లుక్ లో కనిపించేందుకు స్పెషల్ గా రెడీ అయ్యారు. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఆ సినిమా షూటింగ్ కూడా పూర్తయింది. ముందుగా ప్రకటించిన ప్రకారం 2027 జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రావాలి. సంక్రాంతి సీజన్ లో సినిమాను రిలీజ్ చేయడం ఎంతవరకు కలిసొస్తుందనేది ఇప్పుడు కీలకం. పండగ సెలవులు ఉండటంతో ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తారు. దీంతో సినిమాకు మంచి వసూళ్లు సాధించే అవకాశం ఉంటుంది. అయితే పోటీ ఎక్కువైతే థియేటర్లు, షోల సంఖ్య తగ్గే ప్రమాదం ఉంది. సినిమా బాగున్నా సరైన స్థాయిలో థియేటర్లు దక్కకపోతే వసూళ్లపై ప్రభావం పడొచ్చు. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన SYGకు ఇది ఇంపార్టెంట్ విషయం. అందుకే సంక్రాంతి నుంచి తప్పుకోవడం కూడా అంత ఈజీ కాదు. మరో తేదీకి వాయిదా వేసుకుంటే పోటీ తగ్గి ఎక్కువ థియేటర్లు దక్కే అవకాశం ఉంటుంది. కానీ సోలోగా విడుదల చేసినంత మాత్రాన వసూళ్లు వచ్చేస్తాయనే హామీ లేదు. పండగ సీజన్ లో ఉండే ప్రేక్షకుల రద్దీ, హాలీడేస్ బెనిఫిట్ మరో సమయంలో ఉండకపోవచ్చు. ముఖ్యంగా సినిమాకు వచ్చే టాక్ బట్టి పోటీ లేకపోయినా వసూళ్లు ఆశించిన స్థాయికి చేరకపోవచ్చు. చివరకు ప్రేక్షకులకు నచ్చితేనే సినిమా నిలబడుతుంది. ఇదే ఎస్‌వైజీ టీమ్ కు అదే అసలు టెస్ట్ . సినిమా కంటెంట్ పై నమ్మకంతో ప్రకటించిన తేదీకే వస్తే పోటీని తట్టుకోవాలి. మరోవైపు వాయిదా వేసుకుంటే కంటెంట్ పైనే ఎక్కువగా ఆధారపడాల్సి ఉంటుంది. అంటే రెండు వేల్లోని రిస్క్ ఉంది. అయితే స్టోరీ, యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే పోటీని అధిగమించడం కూడా అసాధ్యం కాదు. అందుకే విడుదల తేదీ కంటే సినిమా కంటెంట్ పైనే ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తవడంతో మూవీ టీమ్ ముందు విడుదలకు సంబంధించిన పనులే ఉన్నాయి. సినిమాపై ఉన్న నమ్మకాన్ని వసూళ్లుగా మార్చుకోవాలంటే సరైన టైమ్ ఎంచుకోవడం ముఖ్యం. అయితే విడుదల తేదీ ఛేంజ్ పై ఇప్పటివరకు అనౌన్స్మెంట్ రాలేదు. మరి SYG టీమ్ సంక్రాంతి రిస్క్ నే ఎంచుకుంటుందా.. లేక సోలో రిలీజ్ సవాల్ కు సిద్ధమవుతుందా? దీనిపై క్లారిటీ రావాలంటే మరికొంత సమయం వేచి చూడాల్సిందే.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com